మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

వినాయక చవితి శుభాకాంక్షలు

శుభాకాంక్షలు
పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు.
- దీవకొండ దామోదర్‌రావు, సీఎండీ, తెలంగాణ పబ్లికేషన్స్



గమనిక
రేపటి ఆదివారం అనుబంధం బతుకమ్మ బదులుగా వినాయక వ్రతకల్పం నేటి సంచికతో ఉచితంగా అందుకోండి

: సెలవు :
వినాయక చవితి పండుగ సందర్భంగా శనివారం (07-9-2024) మా కార్యాలయానికి సెలవు. కావున 8వ తేదీ ఆదివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం (09-9-2024). -ఎడిటర్

శనివారం SATURDAY 7.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 + 36 పేజీల వినాయక వ్రతకల్పం Pages: 12+4 + 36 pages Vinayaka Vratha kalpam | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 94 ‖ వెల (Price) రూ.6.50 | వినాయక చవితి

శనివారం, సూర్యోదయం: 6-03, సూర్యాస్తమయం: 6-25. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: చవితి సాయంత్రం 5-38 వరకు. నక్షత్రం: చిత్త పగలు 12-34 వరకు, తదుపరి స్వాతి. వర్జ్యం: సాయంత్రం 6-52 నుంచి రాత్రి 8-40 వరకు. రాహుకాలం: ఉదయం 9-08 నుంచి ఉదయం 10-41 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-04 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 5-35 నుంచి మర్నాడు ఉదయం 7-25 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

మాఫీ కాని రుణం.. పోయింది రైతన్న ప్రాణం



రుణమాఫీ కాకపోవడంతో మనస్తాపం చెంది మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకున్న సిద్దిపేట జిల్లా చిట్టాపూర్ రైతు సురేందర్‌రెడ్డి మృతదేహానికి గాంధీ దవాఖాన మార్చురీ వద్ద శుక్రవారం నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు (ఇన్‌సెట్‌లో) సురేందర్‌రెడ్డి

మేడ్చల్ వ్యవసాయ కార్యాలయంలోనే ఆత్మహత్య
ఇనుప మెట్లకు ఉరేసుకొన్న రైతు సురేందర్‌రెడ్డి
రుణమాఫీ కానందునే ఆత్మహత్య అని సూసైడ్ నోట్
సురేందర్‌రెడ్డి ఆత్మహత్య కలచివేసింది: కేటీఆర్

'నా చావుకు కారణం క్రాప్‌లోన్. చిట్టాపూర్ బ్యాంకులో రుణమాఫీ కాలేదని ఆత్మహత్య' అని సూసైడ్ నోట్ రాసి ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అదీ ప్రభుత్వ కార్యాలయంలోనే తనువు చాలించాడు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన అసంబద్ధ నిబంధనే ఆ రైతు ఉసురు తీసింది. పదేండ్ల కిందటి కాంగ్రెస్ సర్కారు హయాంలో సాగు నీరు లేక పంటలు సాగుకాక ఉపాధి బాటపట్టిన ఆ రైతు.. నేడు అదే కాంగ్రెస్ పాలనలో పంట రుణం మాఫీ కాలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. మేడ్చల్ మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటనలో సిద్దిపేట జిల్లాకు చెందిన రైతు సురేందర్‌రెడ్డి తనువు చాలించాడు.

మేడ్చల్/దుబ్బాక, సెప్టెంబర్ 6: కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ మోసానికి మరో అన్నదాత అసువులు బాసాడు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ వ్యవసాయ కార్యాలయంలో జరిగిన ఈ విషాద ఘటన శుక్రవారం వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సోలిపేట సురేందర్‌రెడ్డి (52) బలవన్మరణంతో మేడ్చల్‌తో పాటు ఆయన సొంత గ్రామంలోనూ › 2వ పేజీలో

అప్పులబాధతో రైతన్న బలవన్మరణం

వరదలో ఇల్లు మునిగిందని కానిస్టేబుల్ ఆత్మహత్య

ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు మరో విద్యార్థి బలి

మాఫీ.. మాయ!
లక్షల పేర్లు గల్లంతు

- ఎవరి వద్దా స్పష్టత లేక అన్నదాతల అగచాట్లు
- డాటా ప్రభుత్వానికి పంపామంటున్న బ్యాంకులు
- వ్యవసాయశాఖ సర్వేలోనూ కనిపించని పేర్లు
- 31 సాంకేతిక సమస్యలు గుర్తించిన అధికారులు
- కానీ, రేషన్‌కార్డు సమస్యపైనే సాగుతున్న సర్వే
- మరి ఇతర సమస్యలను గుర్తించేదెప్పుడు?



మంత్రికి చెప్పినా గాలే! › 2

2018లో అప్పతీసుకున్నం. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంట వస్తన్నం. ఇప్పుడు మాఫీ గాలే. బ్యాంకుకు వెళ్లి అడిగితే లిస్టు పంపినమన్రు. అగ్రికల్చర్ అఫీసుకు పోయి అడిగితే.. మమ్మల్ని ఏం జేయమంటవు? నీ ఆధార్ కొడితే నో డాటా ఫౌండ్ అని సూపెడుతున్నది. ఇంకోసారి మా దగ్గరకి రాకండి అని సెప్పతున్రు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి రుణమాఫీ కాని జాబితా ఇచ్చిన. సూత్తం సేత్తం అని అన్నరు కాని మాఫీ అయితే కాలేదు.

- గడ్డం ప్రవీణ్‌రెడ్డి, రైతు, రేగొండ, అక్కన్నపేట మండలం



ఉద్యమనేత 'జిట్టా' కన్నుమూత

అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత బాలకృష్ణారెడ్డి మృతి
కొంత కాలంగా బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌కు చికిత్స › 7
భువనగిరిలో అంత్యక్రియలు
జిట్టా మృతికి కేసీఆర్ దిగ్భ్రాంతి
పలువురు ప్రముఖుల నివాళి



మహేశ్ కుమార్ గౌడ్ టీపీసీసీ నూతన చీఫ్ › 7

ప్రకటించిన కేసీ వేణుగోపాల్
సస్పెన్స్‌కు అధిష్ఠానం తెర
మహేశ్‌కు సీఎం రేవంత్ అండ!



బడిపిల్లల పట్టుదల.. తలవంచిన సర్కార్

- తొలగించిన గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీ తిరిగి విధుల్లోకి
- ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ వర్షిణి ఆదేశాలు
- 'నమస్తే తెలంగాణ'కు ఉద్యోగుల ప్రత్యేక కృతజ్ఞతలు
- కాంగ్రెస్ అనాలోచిన నిర్ణయానికి విద్యార్థులు బలి
- సర్కారుపై జగదీశ్‌రెడ్డి, కొప్పుల, ఆర్ఎస్పీ ఆగ్రహం
- రోడ్డున ఫ్యాకల్టీకి బీఆర్ఎస్ నేతల అండ
- హరీశ్‌రావుతో లేఖతో దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీలోని పార్ట్ టైం ఉద్యోగుల తొలగింపుపై ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గింది. రాత్రికిరాత్రే విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సెక్రటరీ అలగు వర్షిణి అన్ని గురుకులాల ప్రిన్సిపాల్స్, జోనల్ ఆఫీసర్లకు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని › 6వ పేజీలో

కేసీఆర్ ఆనవాళ్లను తుడిచేసే కుట్ర

- గురుకులాల నిర్వీర్యం అందులో భాగమే
- అధికారులను ప్రోత్సహిస్తున్న సర్కార్
- సీవోఈలను భ్రష్టు పట్టిస్తుండటమే నిదర్శనం
- బడుగులను విద్యకు దూరం చేసే పన్నాగం
- ఇంటర్నేషనల్ స్కూళ్లు కాదు.. ఉన్న గురుకులాలను ఆ స్థాయికి తీసుకెళ్లండి › 6
- 'నమస్తే' ఇంటర్వ్యూలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



ధాన్యం స్కాంపై పెద్ది పిటిషన్

రాష్ట్ర సర్కారుకు హైకోర్టు నోటీసు



పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం › 3


ఉరేసుకున్న సోలిపేట సురేందర్‌రెడ్డి


సిద్దిపేట జిల్లా చిట్టాపూర్‌లో కూలిపోయిన స్థితిలో సురేందర్‌రెడ్డి ఇల్లు


చిట్టాపూర్‌లో సురేందర్‌రెడ్డి వ్యవసాయ పొలం

ఇంకెందరు రైతులు బలికావాలి?

- రుణమాఫీలో సర్కార్ ఫెయిల్
- రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య కలిచివేసింది
- ఇప్పటికైనా రైతులందరికీ రుణమాఫీ చేయాలి
- కేసీఆర్ పాలనలో తగ్గిన రైతు ఆత్మహత్యలు: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ): 'మీ సర్కారు వైఖరి వల్ల ఇంకా ఎంతమంది రైతులు బలికావాలి? ఎంతకాలం బాధలు భరించాలి? ఈ బాధలు పడొద్దనే కదా, పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నది' అని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రుణమాఫీ కాలేదన్న వేదనతో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీ విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఇంకా ఎంతమంది రైతులు ఆత్మహత్య లు చేసుకోవాలని ప్రశ్నించారు. రైతులు ఇలాంటి బాధలు పడొద్దనే తెలంగాణ పోరు జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతు రుణమాఫీ విషయంలో తమ వైఫల్యాన్ని ఒప్పుకొని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. స్ఫూర్తిదాయకమైన విధానాలతో రైతు ఆత్మహత్యలు లేని తెలంగాణను కేసీఆర్ సృష్టించారని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గుదల, తృణధాన్యాల ఉత్పత్తిలో అగ్రగామికి ఎదిగిన రాష్ట్ర వ్యవసాయ ముఖచిత్రాన్ని గ్రాఫ్ రూపంలో పేర్కొన్నారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2015లో 11.1 శాతం ఉన్న రైతు ఆత్మహత్యలు 2022 వచ్చేసరికి 1.57 శాతానికి తగ్గిన గ్రాఫ్‌ను, 2015లో కేవలం 2.1 శాతం ఉన్న తృణధాన్యాల ఉత్పత్తి 2022 నాటికి 6.85 శాతానికి పెరిగిన వైనాన్ని ఉదహరించారు.

25 లక్షల చొప్పున పరిహారం ఎందుకివ్వరు?

భారీ వర్షాలు, వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వం మౌనం వీడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం ఎందుకు పంపిణీ చేయరని ప్రశ్నించారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో మరణించిన వారి వివరాలు వెల్లడించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 31 మంది మరణిస్తే కేవలం 16 మంది మృతి చెందారని ప్రభుత్వం ఏ విధంగా లెక్కగట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా మరణించిన 31 మంది వివరాలను ఆయన పేర్లతో సహా విడుదల చేశారు.

కాళోజీ కళాకేంద్రం.. కేసీఆర్ ఇచ్చిన శాశ్వత నివాళి

ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీకి కేసీఆర్ శాశ్వత నివాళి ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కాళోజీ చావు, పుట్టుక మధ్య జీవితమంతా తెలంగాణదేనన్నారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి కీర్తిని తెలంగాణ సమాజం గుర్తుంచుకునేలా సెప్టెంబర్ 9న కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకొన్నామని తెలిపారు. హెల్త్ వర్సిటీకి కాళోజీ పేరు పెట్టిన విషయాన్ని ఉదహరించారు. వరంగల్‌లో కాళోజీ కళాకేంద్ర నిర్మాణం భవిష్యత్తు తరాల వారధిగా ఉండేలా కేసీఆర్ రూపకల్పన చేశారని, ఆ కేంద్రం నిర్మాణ దృశ్యాలను కేటీఆర్ ఎక్స్‌వేదికగా పంచుకున్నారు.

..పోయింది రైతన్న ప్రాణం

మొదటిపేజీ తరువాయి...


విషాదఛాయలు అలుముకున్నాయి. చిట్టాపూర్ గ్రామానికి చెందిన సోలిపేట ప్రతాప్‌రెడ్డి, సుశీల దంపతులకు రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కుమారులు. వీరికి పదెకరాల పొలం ఉండగా, దశాబ్దాల కిందటే వివాహాలైన వీరు వేర్వేరుగా నివాసాలు ఉంటున్నారు. గతంలోనే ఇద్దరు కొడుకుల పేరిట చెరో నాలుగెకరాల పొలం, తల్లి సుశీల పేరిట రెండెకరాలు ఉన్నది. పదేండ్ల కిందట సాగునీటి సమస్యతో రెండు కుటుంబాలు గ్రామం విడిచి వలస వెళ్లారు. పెద్ద కొడుకు రవీందర్‌రెడ్డి బొల్లారంలో, సురేందర్‌రెడ్డి మేడ్చల్‌లో తమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. వారి తల్లి సుశీల ఇద్దరు కొడుకుల వద్ద ఉంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటించడంతో సురేందర్‌రెడ్డి సంతోషపడ్డారు. రుణమాఫీ కోసం నెల రోజులుగా తన స్వగ్రామమైన చిట్టాపూర్‌కు వచ్చి వెళ్తున్నాడు. రుణమాఫీ మూడు విడతల జాబితాల్లో సురేందర్‌రెడ్డి పేరు రాలేదు. అతని అన్న రవీందర్‌రెడ్డికి మాఫీ అయ్యింది. తనకు ఎందుకు కాలేదని ఆరాతీశాడు. ఇందుకు కారణం సురేందర్‌రెడ్డి రేషన్‌కార్డులో తన తల్లి సుశీల ఉండటమేనని అధికారులు చెప్పడంతో విస్తుపోయాడు.

చిట్టాపూర్ ఏపీజీవీబీలో పంట రుణాలు

సుశీల సహా ఇద్దరు కొడుకులకు చిట్టాపూర్ ఏపీజీవీబీలోనే పంట రుణ ఖాతాలు ఉన్నాయి. సుశీలకు రెండెకరాల పాస్‌బుక్‌పై రూ.1,15,662 పంట రుణం ఉండగా, రవీందర్‌రెడ్డికి నాలుగెకరాల పాస్ పుస్తకంపై రూ.1.60 లక్షల రుణం ఉన్నది. సురేందర్‌రెడ్డికి నాలుగెకరాల పాస్ పుస్తకంపై రూ.1,92,443 రుణం ఉన్నది. వీరిలో రవీందర్‌రెడ్డికే రుణమాఫీ అయ్యింది. నాలుగురోజుల క్రితం రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి కలిసి ఏపీజీవీబీలో రుణమాఫీ గురించి మేనేజర్‌ను అడిగారు. సురేందర్‌రెడ్డికి ఆయన తల్లికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నందున రుణమాఫీ కాలేదని బ్యాంకు మేనేజర్ అనిరుధ్ చెప్పారు. రేషన్‌కార్డులో ఉన్న కుటుంబసభ్యులకు 2 లక్షలు మాత్రమే మాఫీ అవుతుందని చెప్పడంతోపాటు మిగతా డబ్బులు చెల్లించాల్సిందేనని సూచించారు. మానసికంగా కలత చెందిన సురేందర్‌రెడ్డి గురువారమే మేడ్చల్ వెళ్లాడు. రుణమాఫీ జరగలేదని కుటుంబసభ్యులకు చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు.

ఏవో కార్యాలయంలో విగతజీవుడై..

ఇంటి నుంచి గురువారం బయటకు వెళ్లిన సురేందర్‌రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున మేడ్చల్ వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో విగతజీవుడై కనిపించాడు. కార్యాలయ ఆవరణలోని ఇనుప మెట్లకు తాడు కట్టి.. మెడకు బిగించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై ఉన్న ఎస్బీఐ ఏటీఎం స్లిప్పులను పోలీసులు గుర్తించారు. ఒక స్లిప్‌లో 'నా చావుకు కారణం క్రాప్‌లోన్. చిట్టాపూర్ బ్యాంకులో రుణమాఫీ కాలేదని ఆత్మహత్య' అని కింద మూడు ఫోన్‌నంబర్లు రాశాడు. మరో స్లిప్‌లో 'నా చావుకు కారణం నా అమ్మ' దాని కిందనే మరోసారి చిట్టాపూర్ బ్యాంకులో క్రాప్‌లోన్ మాఫీ కాలేదని ఆత్మహత్య' అని రాశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. తల్లికి, తనకు ఒకటే రేషన్‌కార్డు ఉన్నందున రుణమాఫీ కానందుకే సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్టుగా తెలుస్తున్నదని పోలీసులు చెప్పారు.




సూసైడ్ నోట్

రైతుకు ఉరిపోసిన రేషన్‌కార్డు నిబంధన

రైతు పాస్ పుస్తకం ప్రాతిపదికన రుణమాఫీ జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ రేషన్‌కార్డు ఆధారంగానే మాఫీ అమలైంది. ఇదే సురేందర్‌రెడ్డి ఉసురు తీసింది. సురేందర్‌రెడ్డి ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని గ్రామస్థులు తెలిపారు. పదేండ్ల కిందట కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు సాగునీరు లేక సాగు సాధ్యం కాక ఉపాధి కోసం కుటుంబంతో కలిసి మేడ్చల్‌కు వలస వెళ్లాడని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పంట రుణమాఫీ జాబితాలో సురేందర్‌రెడ్డి పేరు రాలేదని ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేసుకుంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి గాంధీ దవాఖానకు వెళ్లి సురేందర్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబానికి రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

2500 మంది రైతులకే మాఫీ

చిట్టాపూర్ ఏపీజీవీబీలో 3,400 మంది రైతులు రుణాలు తీసుకోగా 2,500 మంది రైతులకు రూ.20.53 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా 900 మందికి మాఫీ కాలేదని బ్యాంకు అధికారులు వెల్లడించారు.



లోకం పోకడ

నేను గణేశ గణన చేపడుతున్నా స్వామీ!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	35.0°c	24.1°c
మెదక్	34 .4°c	22.2°c
రంగారెడ్డి	33.2°c	21.7°c
ఖమ్మం	32.0°c	24.0°c
కరీంనగర్	31.0°c	26.0°c
నల్లగొండ	30.5°c	23.4°c
హైదరాబాద్	30.8°c	22.9°c
మహబూబ్‌నగర్	30.0°c	22.0°c
నిజామాబాద్	29.0°c	23.4°c
వరంగల్	28.0°c	25.0°c


వరంగల్ జేపీఎన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పాలి

పురుగు మందు డబ్బాలతో రైతుల ఆందోళన

గిర్మాజీపేట, సెప్టెంబర్ 6: అర్హులైన తమకు రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పాలని రైతులు శుక్రవారం వరంగల్ జేపీఎన్ రోడ్‌లోని కెనరా బ్యాంకు ఎదుట పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు దేవుళ్ల మీద దొంగ ఒట్లు పెట్టి ఇప్పుడు రుణమాఫీకి అనేక కొర్రీలు పెడితే మూకుమ్మడిగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వానలు, వరదల్లో అసమతుల్యత

- గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వల్లే
- 90 రోజుల్లో 75 రోజులు వానలే
- వర్షాలు కురిసినా నిండని చెరువులు
- తక్కువ రోజులు వర్షాలు పడ్డ చోట ఎక్కువ వర్షపాతం నమోదు
- ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్ ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్లోబల్ వార్మింగ్ (భూతాపం)తోపాటు కాలుష్యం పెరగడంతో వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుని వానలు, వరదల్లో అసమతుల్యత చోటు చేసుకుంటున్నది. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న పరిస్థితులే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలో కొన్ని రోజుల నుంచి కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో వానలు బీభత్సం సృష్టించాయి. 31 జిల్లాల్లో సాధారణ స్థాయి కంటే 41% అదనపు వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 6 వరకు 608.7 మి.మీ. వాన కురువాల్సి ఉండగా.. శుక్రవారం నాటికి 855.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి 90 రోజుల్లో ఏకంగా 75 రోజులు వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఈ వానల్లో గతంలో ఎన్నడూ లేని వ్యత్యాసాన్ని వాతావరణ నిపుణులు గుర్తించారు. ఎక్కువ రోజులు వాన కురిసిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం.. తక్కువ రోజులు వాన కురిసిన చోట ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఎక్కువ వర్షాలు కురిసిన చోట చెరువులు, జలాశయాలు నిండలేదు. రాష్ట్రంలోని 34,716 చెరువుల్లో 65% మాత్రమే నిండడంపై ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్టు చైర్మన్ చెన్నమనేని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

> **"వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వల్లే..**
>
> 
>
> రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అధికంగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా వర్షాలు కురవటానికి గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, కాలుష్యం పెరిగిపోవడం, వ్యవసాయంలో పురుగు మందుల వినియోగం అధికమవడమే ప్రధాన కారణం. వీటి వల్ల ఒకే ప్రాంతాల్లోగా వానలు కురుస్తున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతున్నది. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు ప్రజలతోపాటు వాతావరణ సంస్థలు అప్రమత్తం కావాల్సిన అవసరమున్నది.
>
> - ఇండో-జర్మన్ క్లైమేట్ చేంజ్ ప్రాజెక్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్

6 వేల చెరువుల్లో సగం కూడా నిండని నీళ్లు

రాష్ట్రంలోని 6 వేల చెరువుల్లో నీటిమట్టం సగానికి కూడా పెరగలేదు. 2,200 చెరువుల్లో పావు వంతు నీళ్లు ఉన్నాయి. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల్లో 50% అధికంగా వానలు కురిసినప్పటికీ ఆ జిల్లాల పరిధిలోని 2,559 చెరువుల్లో కనీసం 40% కూడా నిండలేదు. మహబూబ్‌నగర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం 1,800 చెరువులు పొంగిపొర్లుతున్నాయి. మరో 340 చెరువులు నిండాల్సి ఉన్నది.

అన్నదాతలూ.. ధైర్యం కోల్పోకండి!

మాజీ మంత్రులు హరీశ్, మల్లారెడ్డి వినతి

రైతు సురేందర్‌రెడ్డికి నివాళి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అన్నదాతలారా.. రుణమాఫీ కాలేదని ధైర్యాన్ని కోల్పోవద్దని మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. రుణమాఫీ కాలేదని ఆత్మహత్య చేసుకున్న సిద్దిపేట రైతు సురేందర్‌రెడ్డి మృతదేహం ఉన్న గాంధీ దవాఖాన మార్చురీ వద్ద శుక్రవారం నివాళులర్పించారు. రుణమాఫీ కాలేదనే మనస్తాపంతో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేసేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. సీఎం తప్పుడు ప్రకటనలు, బుకాయింపులతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని చెప్పారు. మ్యానిఫెస్టోలో చెప్పినట్టు రైతులందరికీ రుణమాఫీ చేసే దిశగా బాధ్యతగా వ్యవహరించాల్సిందిగా సీఎంకు హితవు పలికారు. మాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి నిర్దేశించుకున్న గడువు ముగిసి నెల కావస్తున్నదని, ఇప్పటికైనా కండ్లు తెరిచి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బంగారం లాంటి తెలంగాణను అతలాకుతలం చేశారన్నాని ఎమ్మెల్యే మల్లారెడ్డి విమర్శించారు. రుణమాఫీ కాలేదని మేడ్చల్‌లో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రైతులంతా ఆనందంగా ఉన్నారని, నాడు దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.


నల్లగొండ జిల్లా త్రిపురారం రైతు వేదిక ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రుణమాఫీ చేయాలని త్రిపురారంలో రైతుల ధర్నా

త్రిపురారం, సెప్టెంబర్ 6 : షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లగొండ జిల్లా త్రిపురారం రైతు వేదిక ఎదుట బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అన్నదాతలు ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 35 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్లలో పేర్లు తప్పు ఉన్నాయని, ఎక్కువగా ఉన్న వడ్డీ డబ్బులను చెల్లించాలని, లేనట్లయితే రుణమాఫీకి అర్హులు కాకుండా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రుణమాఫీపై అధికారులకు పూర్తి స్పష్టత లేదని, బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. రోజూ మండల కేంద్రానికి ఐదారు వందల మంది రైతులు వస్తున్నారని, వారి గోడును వినలేకే బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన ధర్నా చేపట్టినట్టు తెలిపారు.

సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

అనారోగ్యంతో కన్నుమూసిన కవి • సంతాపం తెలిపిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ) : ప్రముఖ కవి, సినీ గేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ(76) హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆటా వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన ఆయన, ఆరోగ్యం దెబ్బతినడంతో జూలై 16న హైదరాబాద్ దవాఖానలో చేరారు. వడ్డేపల్లి సిరిసిల్లలో ఓ చేనేత కుటుంబంలో జన్మించగా, హైదరాబాద్‌లోని నాగోల్‌లో స్థిరపడ్డారు. రెండ్రోజుల క్రితమే తెరసం ఆయనకు జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేసింది.

వడ్డేపల్లి కృష్ణ మృతిపట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో ఆయన సేవలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణ మృతికి కవులు, కళాకారులు, రచయితలు, సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

ఇల్లు నీట మునిగిందని..

గోదావరిలో దూకి కానిస్టేబుల్ ఆత్మహత్య

తండ్రి కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు..

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ఆరోగ్యం

సెల్ఫీ వీడియో తీసుకుని బలవన్మరణం


రమణారెడ్డి(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం(నమస్తే తెలంగాణ)/బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 6 : 'నాన్న ఇన్నాళ్లూ కష్టపడి కట్టుకున్న ఇంటిని వరద ముంచింది. ఆ నష్టం ఎవరూ పూడ్చలేనిది. యాక్సిడెంట్‌లో దెబ్బతిన్న నా ఆరోగ్యం పూర్తిగా సహకరించడం లేదు. అనారోగ్యంతో భార్య ఆరోగ్యం కూడా క్షీణిస్తున్నది. ఇవన్నీ నాకే ఎందుకు జరుగుతున్నాయి? వీటిని నేను భరించలేను. ఇక చనిపోతున్నా' అంటూ కన్నీటిని దిగమింగుకుంటూ సెల్ఫీ వీడియో తీసుకున్న ఓ కానిస్టేబుల్ ఆ తర్వాత గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రతి ఒక్కరినీ కలిచివేసిన ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన 2000 బ్యాచ్‌కు కానిస్టేబుల్ రమణారెడ్డి(47) కొత్తగూడెం టూ టౌన్ పరిధిలోని క్లూస్ టీం విభాగంలో పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. రమణారెడ్డి తండ్రి సింగరేణిలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. పాల్వంచ వెంకటేశ్వర హిల్స్ కాలనీలో ఇల్లు కట్టుకున్నాడు. రమణారెడ్డి పాల్వంచలోని పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి అతడి తండ్రి ఇల్లు నీటిలో మునిగింది. నాన్న కష్టార్జితం నీట మునిగిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇటీవల భార్య అనారోగ్యానికి గురికావడం, కొడుకు బీటెక్ ఆపేసి ఇంటికి రావడం.. మళ్లీ చదివించడం వంటి ఘటనలతోపాటు కొత్తగూడెంలో పది రోజుల క్రితం లారీని ఢీకొనడంతో రమణారెడ్డి చేయి విరిగింది. ఇవన్నీ తన కుటుంబానికే రావడంతో శని తనను వెంటాడుతుందనే బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తనను క్షమించాలని సెల్ఫీ వీడియోలో కుటుంబ సభ్యులను వేడుకోవడం మరింత వేదనకు గురిచేసింది. సమాచారం అందుకున్న సీఐ, ఎస్సై విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు.

మాఫీ మాయ.. లక్ష పేర్లు గల్లంతు!


- అడుగడుగునా సర్కారు మాయాజాలం
- ప్రభుత్వ సర్వేలో లక్షల పేర్లు మాయం
- 31 సాంకేతిక సమస్యలు గుర్తింపు
- కేవలం రేషన్‌కార్డు సమస్యపైనే సర్వే

కరీంనగర్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/హుస్నాబాద్‌టౌన్): రైతు రుణమాఫీ ఒక మాయగా మారింది. వ్యవసాయ శాఖ తాజా చేపట్టిన సర్వేలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ శాఖ అధికారులకు పంపించిన జాబితాల్లో అన్ని అర్హతలు ఉండీ రుణమాఫీ కానీ లక్షలాది రైతుల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో తమ పేర్లు, డాటా ఎందుకు కనిపించడం లేదో అర్థం కాక, తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక, అడిగినా ఎవరి నుంచీ స్పష్టత రాక లక్షలాది రైతులు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నంలో రుణమాఫీ జరగలేదంటూ 1,400కుపైగా ఫిర్యాదులొచ్చాయి. ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ అధికారులకు వచ్చిన రుణమాఫీ కాని జాబితాను ఫిర్యాదుదారుల ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేసి వెరిఫై చేస్తే, 850కిపైగా రైతుల పేర్లకు సంబంధించిన డాటా 'నాట్ ఫౌండ్' అని చూపిస్తున్నది. రైతులు బ్యాంకుకు వెళ్లి అడిగితే.. అగ్రికల్చర్ అధికారులనే అడగాలని సమాధానమిస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట కెనరా బ్యాంకు శాఖ పరిధిలో వేయికిపైగా రైతుల పరిస్థితి ఇలానే ఉన్నది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కెనరా బ్యాంకు పరిధిలోని వందలాది రైతుల దుస్థితి ఇదే. ఒకటి రెండు బ్యాంకులో, ఒకటి రెండు గ్రామాల సమస్య మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా కొన్ని లక్షల మంది డాటా 'నాట్ ఫౌండ్' అని చూపిస్తున్నది.

అసలేం జరిగింది?

తొలుత అందరికీ రుణమాఫీ చేశామని ప్రకటించిన ప్రభుత్వం, చివరకు రైతులు రోడ్లపైకి రావడంతో వాస్తవాన్ని అంగీకరించింది. క్షేత్రస్థాయి సర్వే చేయించి వారి వివరాలు నమోదు చేసి దశలవారీగా రుణమాఫీ వర్తింప చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ఆగస్టు 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి మాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తారని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, అధికారులు మాత్రం ఇండ్లకు వెళ్లకుండా క్లస్టర్‌వారీగా రైతులను రైతువేదికల వద్దకు పిలుస్తూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటికే 31 సాంకేతిక సమస్యల కారణంగా అందరికీ మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ నేపథ్యంలో రుణమాఫీ కాని రైతుల కోసం సర్వే చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అందరి వివరాలు తీసుకుంటారని రైతులు భావించారు. కానీ, అలా జరగడం లేదు. సర్వే పేరిట ఒక యాప్ ఇవ్వడంతోపాటు ఒక జాబితాను ప్రభుత్వం పంపింది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు.. ఆ జాబితాలో ఉన్న రైతుల వివరాలను మాత్రమే పరిశీలించి, ఫొటోలు తీసి స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ జాబితాను పరిశీలిస్తే, కేవలం రేషన్‌కార్డు అర్హత ఉండి, రుణమాఫీ జరగని రైతుల పేర్లతో కూడిన జాబితాను మాత్రమే ప్రభుత్వం పంపించినట్టు స్పష్టమవుతున్నది. 31 సాంకేతిక అంశాలతో సమస్యలు ఏర్పడి రుణమాఫీ జరగకపోతే, కేవలం రేషన్‌కార్డు సంబంధిత సమస్యను మాత్రమే ప్రస్తుత తాజా సర్వేలో పరిగణనలోకి తీసుకోవడం వల్ల.. మిగిలిన వారి పేర్లు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద ఉన్న జాబితాలో కనిపించడం లేదని తెలుస్తున్నది..

మేమేం పాపం జేసినం



2018లో కెనరాబ్యాంక్ నుంచి రూ.లక్షన్నర అప్పు తీసుకున్న. సంవత్సరానికో సారి మిత్తి కట్టి రెన్యువల్ జేస్తున్న. అయినా నాకు రుణమాఫీ గాలేదు. ఏం పాపం సేసినమో అర్థం అయితలేదు. రోజూ బ్యాంకు సుట్టూ అగ్రికల్చర్ ఆఫీస్ సుట్టూ తిరుగుతనే ఉన్నం. అసలు మా పేర్లు ఎందుకు మాయమైందో ఎవరూ జెప్పడం లేదు.

-దేవసాని శ్రీనివాసరెడ్డి, రైతు, పొట్లపల్లి, హుస్నాబాద్ మండలం

ఏదీ స్పష్టత?

రుణమాఫీ జరగలేదంటూ వస్తున్న ఫిర్యాదులను అధికారులు కొన్నిచోట్ల స్వీకరిస్తుండగా, మరికొన్ని చోట్ల తీసుకోవడం లేదు. దరఖాస్తులను ఏమి చేయాలన్న దానిపై ప్రభుత్వం అధికారులకు స్పష్టత ఇవ్వలేదు. రేషన్‌కార్డుయేతర సమస్యలతో రుణమాఫీ కాకుండా నిలిచిపోయిన రైతుల గురించి తిరిగి సర్వే చేస్తారా? లేదా? సదరు రైతులకు రుణమాఫీ వర్తింపచేస్తారా? లేదా? అనే ప్రశ్నలకు సమాధానం లభించడంలేదు. రుణమాఫీ వర్తించని రైతులందరికీ ఒకేసారి సర్వే చేసి.. వారి వివరాలు నమోదు చేసుకొని రుణమాఫీ వర్తింప చేయాలే తప్ప.. ఒకసారి రేషన్‌కార్డుతో కూడిన సమస్యలు.. మరోసారి మరో సమస్య అంటూ సర్వే చేసుకుంటూ వెళ్తే మరో మూడు నాలుగు నెలలకుపైగా సమయం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దివాలా దిశగా.. కాంగ్రెస్ రాష్ట్రాలు!

- అడ్డగోలు ఉచిత పథకాలతో అప్పుల కుప్పగా రాష్ట్రాలు
- నిన్న హిమాచల్ ప్రదేశ్, నేడు కర్ణాటక, తెలంగాణ
- ఆమ్ ఆద్మీ పార్టీ పాలిత పంజాబ్ రాష్ట్రానిదీ అదే దారి
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనాలోచితంగా హామీలు
- ఖజానాపై పెను భారం.. దీంతో ప్రజలపై పన్నుల పోటు
- సబ్సిడీల్లో కోత, ధరల పెంపు, జీతాలు, చెల్లింపులు వాయిదా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): అధికారమే పరమావధి. దీని కోసం ఎన్ని హామీలైనా గుమ్మరించాలి. అర్హులు ఎవరు? ఎవరు కాదు? అనేది తర్వాత ముచ్చట. గ్యారెంటీలు అమలు చేయగలమా? లేదా? అనే చర్చ వద్దేవద్దు. ముందు ఓటర్లను ఆకర్షించాలి. ఉచిత పథకాలతో మురిపించాలి. అధికారంలోకి రావాలి. తీరా.. అధికారంలోకి వచ్చాక.. నిధుల కటకట మొదలవుతుంది. అనాలోచితంగా ప్రకటించిన హామీలతో రాష్ట్రాలకు రాష్ట్రాలే దివాలా తీసే దుస్థితి దాపురిస్తుంది. నిన్న హిమాచల్ ప్రదేశ్, ఇప్పుడు పంజాబ్, కర్ణాటకలో పరిస్థితులను చూస్తే ఇదే విషయం అర్థమవుతున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ తీసుకొచ్చిన ఉచిత స్కీమ్‌లను ఫాలో అయిన కాంగ్రెస్ పార్టీ.. ఐదు గ్యారెంటీల పేరిట అడ్డగోలు హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. అయితే, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చే దారి లేక ఇప్పటికే పలు గ్యారెంటీల్లో కోతలు పెట్టింది. ప్రజలపై పన్నుల భారం మోపింది. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ. 25 వేల కోట్ల బకాయిలను కూడా చెల్లించట్లేదు. ఇక, ఎన్నికల ముందు 10 గ్యారెంటీలతో ఆశ పెట్టి హిమాచల్‌లో అధికారంలోకి వచ్చిన అదే కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు హామీలకు, సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది. తొలుత ఉచితాలతో మభ్యపెట్టిన పంజాబ్‌లోని ఆప్ సర్కారుకు కూడా ఈ సెగ తగిలింది. పర్యావసనంగా ఇప్పుడు ఆ రాష్ట్రమే దివాలా తీసే ప్రమాదం ఏర్పడింది. దీంతో సబ్సిడీల్లో కోత పెట్టడమే కాకుండా.. పన్నుల వాతకు ఆ సర్కారు శ్రీకారం చుట్టింది.





పంజాబ్‌లో కోతలు.. వాతలు

పెరుగుతున్న అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ సర్కారు కోతల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది. విద్యుత్తు సబ్సిడీలో కోత, పెట్రో పన్నుపై వాతతో ప్రజలపై భారాన్ని మోపేందుకు నిర్ణయించింది. పెట్రోల్‌పై 61 పైసలు, డీజిల్‌పై 92 పైసలు వ్యాట్‌ను విధించిన భగవంత్ మాన్ ప్రభుత్వం.. గృహ వినియోగదారులకు సబ్సిడీ విద్యుత్తు పథకాన్ని ఉపసంహరించుకొన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం చివరినాటికి పంజాబ్ అప్పులు రూ. 3.74 లక్షల కోట్లకు చేరుతాయని బడ్జెట్ సందర్భంగా ప్రభుత్వం వెల్లడించింది. అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి సబ్సిడీల్లో కోత, పన్నుల పెంపును ఓ మార్గంగా చూస్తున్నది.

హిమాచల్ విలవిల

2022 చివర్లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టుకునేందుకు హిమాచల్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా 10 గ్యారెంటీలు ప్రకటించింది. 18 ఏండ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, పాత పింఛన్ విధానం అమలు వంటి అనేక హామీలు ఇచ్చింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఈ హామీలను అమలు చేసే స్థితిలో లేదు. రాష్ట్రం మొత్తం అప్పులే రూ. 86,589 కోట్లకు చేరాయి. ఇదేమీ పట్టించుకోకుండా ఇబ్బడిముబ్బడిగా హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన సుఖ్‌విందర్ సింగ్ సుఖు సర్కారు ఇప్పుడు హామీలకు, ఏకంగా 14 సబ్సిడీలకు కత్తెర పెట్టే పనిని ప్రారంభించింది.

కర్ణాటకలో అలా.. తెలంగాణలో ఇలా

ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో.. ఆరు గ్యారెంటీల ఆర్భాటంతో తెలంగాణలో గెలిచిన కాంగ్రెస్‌కు అసలు తత్వం ఇప్పుడు బోధ పడుతున్నది. గ్యారెంటీల అమలు కర్ణాటకపై పెను ఆర్థిక భారాన్ని మోపింది. దీంతో ధరలు పెంచి, ఖజానా నింపేందుకు సిద్ధరామయ్య సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మరోవైపు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల మేర బిల్లులను ఆలస్యం చేయడంతో అభివృద్ధి పనులకు ఎక్కడికక్కడ బ్రేకులు పడుతున్నాయి. ఇక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా హామీల అమలును మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకటి, రెండు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని సర్కారు చెప్తున్నప్పటికీ లబ్ధిదారులు అందరికీ అందడం లేదన్నది బహిరంగ రహస్యమే.

కాంట్రాక్టర్లకు 25 వేల కోట్ల బకాయిలు

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఇదీ పరిస్థితి

బెంగళూరు: కర్ణాటకలో అభివృద్ధి పనులకు బ్రేకులు పడుతున్నాయి. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోతున్నాయి. దీంతో బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తున్నారు. ఇప్పటికే అప్పులు చేసి పనులు జరిపామని, ఇక బిల్లులు రాకపోతే పనులు కొనసాగించలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పడకేసిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎలాగైనా అధికారంలోకి రావాలనే యావతో ఇచ్చిన గ్యారెంటీలే ఇప్పుడు రాష్ట్రం పాలిట గుదిబండగా, అభివృద్ధికి అడ్డంకిగా మారాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కర్ణాటకలో గత ఏడాది మే నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేటప్పటికి కాంట్రాక్టర్లకు రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మారాక తమ బిల్లులు మంజూరవుతాయని ఆశించారు. కానీ, బిల్లుల బకాయిలు రూ.20 వేల కోట్ల నుంచి రూ.25 వేల కోట్లకు పెరిగాయి. దీంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు వేగంగా జరపడం లేదు. చాలా పనులు నిలిచిపోయాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె సైతం కాంట్రాక్టర్లకు రూ.3,200 బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నగరంలో పనులు వేగంగా జరగడం లేదు.

అయినవారికే చెల్లింపులు

బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం సీనియారిటీ నిబంధనలను పాటించడం లేదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న వారికి అనుకూలమైన కాంట్రాక్టర్లకు మొదట బిల్లులు చెల్లిస్తున్నారని వాపోతున్నారు.

పెట్రో బాదుడికి విముక్తి ఎప్పుడో!

- అంతర్జాతీయ విపణిలో 9 నెలల కనిష్ఠానికి క్రూడాయిల్ ధరలు
- బ్యారెల్ ధర 70 డాలర్లకు దిగువే అయినప్పటికీ, తగ్గించని కేంద్రం
- పదేండ్లలో డీజిల్‌పై 43%, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ డ్యూటీ వడ్డింపు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పెరిగిన నిత్యావసరాల ధరలతో కుదేలవుతున్న సామాన్యుడిని రోజురోజుకూ పెరగడమే తప్ప తరగని పెట్రోలు, డీజిల్ ధరలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున వాటి ధరలు ఇప్పుడైనా కేంద్రం తగ్గిస్తుందేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో బ్యారెల్ ముడిచమురు ధర 9 నెలల కనిష్ఠానికి చేరినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను మాత్రం కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఇంకా తగ్గించట్లేదు. అంతర్జాతీయ విపణిలో ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 70 డాలర్ల దిగువకు చేరింది. అయినప్పటికీ, దేశీయంగా లీటర్ పెట్రోల్ ధర రూ. 109, డీజిల్ ధర రూ. 97గానే ఉన్నది. కాగా, మోదీ ప్రధానిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన 2014లో లీటర్ పెట్రోల్ ధర రూ.71 ఉంటే ప్రస్తుతం ఇది రూ.109కు పెరిగింది. అప్పుడు రూ. 55గా ఉన్న లీటర్ డీజిల్ ధర ఇప్పుడు రూ.97కు చేరింది.

తగ్గకపోగా.. బాదుడే బాదుడు

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రో వాతపెట్టిన ఎన్డీయే సర్కారు.. ధరలు తగ్గినప్పుడు మాత్రం వాటి ధరలను తగ్గించట్లేదు. దీంతో సామాన్యులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. వివరంగా చెప్పాలంటే.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే, దేశీయంగా పెట్రో ధరలు తగ్గాలి. కానీ దానికి విరుద్ధంగా కేంద్రం ఇంధన ధరలను పెంచుకుంటూ పోతున్నది. దీని కోసం ఎక్సైజ్ డ్యూటీ పేరిట అదనపు సుంకాలను విధిస్తున్నది. గత పదేండ్లలో కేంద్రం పెట్రోల్‌పై 109.91 శాతం ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, డీజిల్‌పై ఏకంగా 343.82 శాతం పన్ను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ గణాంకాలు చెప్తున్నాయి. త్వరలో వివిధ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో పెట్రో ధరలు తగ్గవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

నువ్వు దేవుడివా?

అది నిర్ణయించాల్సింది ప్రజలు • ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి సంచలనంగా మారాయి. మనలో దేవుడు ఉన్నాడా? లేదా? అన్నది ప్రజలు నిర్ణయించాలని, మనకు మనం దేవుడిగా అనుకుంటే సరిపోదంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీని ఉద్దేశించి భగవత్ పరోక్షంగా పై వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పూణెలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో భగవత్ ప్రసంగిస్తూ.. 'ప్రతీ ఒక్కరూ సాధ్యమైనంత మేరకు మంచి పనులు చేయాలి. మంచి పనులతో మనం కీర్తి సంపాదించామో లేదో.. నిర్ణయించాల్సింది ప్రజలు. అంతేగానీ, మనకు మనమే దేవుడిగా అనుకొంటే సరిపోదు. మనం దేవుడా? కాదా? అన్నది నిర్ణయించాల్సింది ప్రజలే' అని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ తనకు తాను దైవాంశసంభూతుడిగా అభివర్ణించుకొన్నారు. తాను భగవంతుడు పంపిన దేవ దూతగా చెప్పుకొచ్చారు.



మారిషస్ అధ్యక్షుడితో రవిశంకర్

మాదకద్రవ్య రహిత మారిషస్ సాధనకు కృషి

ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్

బెంగళూరు, సెప్టెంబర్ 6: మాదక ద్రవ్య రహిత మారిషస్‌ను సాధించడం సహా, యువతకు స్వయం సమృద్ధి, సాధికారిత కలిగించే పథకాల గురించి అవగాహన కల్పించేందుకు తాము కృషి చేస్తామని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీశ్రీ రవి శంకర్ పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం గురువారం మారిషస్‌కు చేరుకున్న ఆయనకు ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సింగ్ రూపన్, ప్రధాని ప్రవింద్ కుమార్ జుగ్నౌథ్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, ప్రధానితో జరిగిన సమావేశాల్లో ఆయన మారిషస్‌కు ఆయుర్వేదాన్ని పరిచయం చేయడం, అక్కడి ఖైదీలపై విస్తృత ప్రభావం చూపిన యోగ శిక్షణ కార్యక్రమాల విస్తరణ వంటి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఖైదీలలో మానసిన పరివర్తన తేవడానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ చేపట్టిన ప్రిజన్ స్మార్ట్ కార్యక్రమాలు కొనసాగించడం కోసం అక్కడి ప్రభుత్వంతో అంగీకార పత్రంపై సంతకాలు చేయనున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వినేశ్, పునియా


న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ఒలింపియన్ రెజ్లర్లు వినేశ్ ఫోగట్, బజరంగ్ పునియా శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరారు. అంతకు ముందు వారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలిశారు. కాంగ్రెస్‌లో చేరిన ఫోగట్, పునియా రైల్వేలో తమ ఉద్యోగాలకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. బజరంగ్ పునియాను ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వర్కింగ్ చైర్మన్‌గా ఏఐసీసీ నియమించింది.

31 మందితో కాంగ్రెస్ జాబితా

హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు 31 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితాను శుక్రవారం విడుదల చేసింది. వినేశ్ ఫోగట్‌ను జులానా నుంచి బరిలో నిలిపింది.

హర్యానా బీజేపీకి వరుస షాక్‌లు

అసెంబ్లీ ఎన్నికల కోసం 67 మంది బీజేపీ విడుదల చేసిన మొదటి లిస్టులో 40 మందిని మార్చడం పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. టికెట్ దక్కని మంత్రి రంజిత్ చౌతాల, మాజీ మంత్రి సావిత్రి జిందాల్, పలువురు నేతలు రాజీనామా చేశారు. మరోవైపు అత్యాచార కేసులో దోషి అయిన గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్(డేరా బాబా)కు ఆరుసార్లు పెరోల్ ఇచ్చిన జైళ్ల శాఖ మాజీ అధికారి సునీల్ సంగ్వాన్‌కు బీజేపీ దాద్రి టిక్కెట్ ఇవ్వడం వివాదంగా మారింది.



ఎస్వతిని రాజు 16వ భార్యగా దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడి కుమార్తె

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా కుమార్తె నొమ్సెబో జుమా (21), ఎస్వతిని రాజు ఎంస్వతి-2 (56) మధ్య ప్రేమ చిగురించింది. సంప్రదాయ నృత్య సంబరాల్లో పాల్గొన్న నొమ్సెబోను రాజవంశపు పెండ్లి కుమార్తెగా ప్రకటించారు. వీరి వివాహం త్వరలో జరగబోతున్నది. ఎంస్వతి-2కు ఇది 16వ వివాహం. ఆయనకు ప్రస్తుతం 11 మంది భార్యలు ఉన్నారు. నొమ్సెబో ఆయనకు 16వ భార్య కాబోతున్నారు. కింగ్ ఎంస్వతి, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా బంధువులే.

హత్రాస్ రోడ్డు ప్రమాదంలో 15 మంది మృతి

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో శుక్రవారం ఓ బస్సు, వ్యాను ఢీకొనడంతో 15 మంది మరణించగా, 16 మంది గాయపడ్డారు. గాయపడినవారిని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు అధికారులు చెప్పారు. ఆగ్రా-అలీగఢ్ జాతీయ రహదారిపై బస్సు ఓ వ్యానును ఢీకొట్టింది. కన్వర్‌పూర్ గ్రామం వద్ద ఈ దారుణం జరిగింది. మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.50,000 చొప్పున ఆర్థిక సాయాన్ని మోదీ ప్రకటించారు.

కొవిడ్ నిధులు కాజేశారు!

గత బీజేపీ సర్కారుపై జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ మధ్యంతర నివేదిక

1,120 కోట్ల నిధుల దుర్వినియోగం..చర్యలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం



సీఎంకు నివేదికను సమర్పిస్తున్న జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్

బెంగళూరు, సెప్టెంబర్ 6: కర్ణాటకలో మరో కుంభకోణం తెర మీదకు వచ్చింది. గత బీజేపీ హయాంలో కొవిడ్ నిర్వహణకు కేటాయించిన రూ.1,120 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ కన్హ కమిషన్ మధ్యంతర నివేదిక సమర్పించింది. దీంతో ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఉన్నతాధికారులతో కమిటీ

జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి, తదుపరి చర్యలను సూచించాల్సిందిగా కోరుతూ కర్ణాటక ప్రభుత్వం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం జరిగిన క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు ఇచ్చింది. మరోవైపు ఈ అంశానికి సంబంధించి విచారణను పూర్తి చేసేందుకు జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ గడువును మరో ఆరు నెలలు పొడిగించింది.

ఆరోపణలు ఏమిటీ?

కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మొదటిసారి లాక్‌డౌన్ విధించిన 2020 మార్చి నుంచి 2022 డిసెంబరు 31 వరకు కొవిడ్ నిర్వహణకు ఖర్చు చేసిన రూ.7,223 కోట్ల నిధుల్లో. రూ.1,120 కోట్ల దుర్వినియోగం జరిగిందని సిద్ధరామయ్య నియమించిన జాన్ మైఖేల్ కమిషన్ తెలిపింది. కాగా ముడా స్కామ్‌కు కౌంటర్‌గానే సిద్ధూ ప్రభుత్వం దీనిని తెరపైకి తెచ్చిందని బీజేపీ ఆరోపిస్తున్నది.

నా భద్రతకు ముప్పుంది: కర్ణాటక గవర్నర్

అధికార కాంగ్రెస్ పార్టీ నేతల తీరు వల్ల తన భద్రతకు ముప్పు ఏర్పడిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర హోం శాఖకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు తాను ఇచ్చిన అనుమతిని రాజకీయ పక్షపాతంతో కూడినదిగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రాష్ట్ర మంత్రులు, నేతలు ఉద్దేశపూర్వకంగా ''గో బ్యాక్ గవర్నర్'' ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.



అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి

కశ్మీరీ పండిట్ మహిళ పోటీ

శ్రీనగర్: జమ్ము కశ్మీర్ శాసన సభ ఎన్నికల్లో రికార్డులు నమోదవడం ప్రారంభమైంది. మూడు దశాబ్దాల్లో తొలిసారి ఓ కశ్మీరీ పండిట్ మహిళ డైజీ రైనా ఈ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఆమె ఢిల్లీలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసేవారు. ఆమె పుల్వామాలోని ఫ్రీసల్ గ్రామ సర్పంచ్ కూడా. ఆమె రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) తరపున బరిలో నిలిచారు. ఈ పార్టీ ఎన్డీయేలో భాగస్వామి. రాజ్‌పొర శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న డైజీ రైనా మాట్లాడుతూ, యువత తమ గళంగా నిలవాలని తనను కోరారని, అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తాను సర్పంచ్‌గా పని చేస్తున్నానని, యువతను కలుస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకుంటూ ఉంటానన్నారు.

తోడేళ్లతో బహరాయిచ్ గడగడ

యూపీలోని ఈ జిల్లాలో విద్యా సంస్థలు, మార్కెట్లు బంద్

ఇప్పటికే పది మంది మృత్యువాత.. 35 మందికి గాయాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): మానవ రక్తం రుచి మరిగి ప్రాణాంతకంగా మారిన తోడేళ్ల బెడదతో యూపీలోని బహరాయిచ్ జిల్లా గడగడలాడుతున్నది. తోడేళ్ల భయంతో పిల్లలు స్కూళ్స్, కాలేజీలకు వెళ్లడం మానేశారు. మార్కెట్లు, దుకాణాలు బంద్ అయ్యాయి. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికే భయపడే దుస్థితి దాపురించింది. మాహ్సీ సబ్ డివిజన్‌లోని పలు గ్రామాలు భయంతో నిర్మానుష్యంగా మారిపోయాయి.

50 రోజులుగా భయం భయం

గడిచిన 50 రోజులుగా జిల్లా వాసులు కంటి మీద కునుకులేకుండా బతుకుతున్నారు. నరమాంస భక్షక తోడేళ్ల దాడిలో 35 మంది ప్రజలు గాయపడ్డారు. 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అటవీ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ భేడియా' నిర్వహించి నాలుగు తోడేళ్లను పట్టుకున్నారు. ఇంకా మిగిలిన రెండు తోడేళ్ల కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతున్నది.

దాడులు అందుకే..

జనావాసాల్లోకి వచ్చి మరీ తోడేళ్లు దాడులు చేయడానికి గల కారణాలపై అటవీశాఖ నిపుణులు గతంలో తమ అనుభవాలను బట్టి పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు. తమ ఆవాసాలను, సంతానాన్ని కాపాడుకోవడానికే తోడేళ్లు ఈ రకమైన దాడులకు తెగబడొచ్చని దూద్వా నేషనల్ పార్క్ మాజీ డైరెక్టర్ సంజయ్ పాఠక్ అభిప్రాయపడ్డారు. సాధారణంగా తోడేళ్లు తమ పిల్లలకు ఎవరైనా హాని తలపెట్టినట్టు భావిస్తే ఈ తరహా దాడులు చేస్తాయన్నారు. బహరాయిచ్‌లో జరుగుతున్న దాడులకు ఇదే కారణం అయి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

'సామూహిక రేప్ జరగలేదు'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై సామూహిక రేప్ జరిగిందని జరుగుతున్న ప్రచారాన్ని సీబీఐ తోసిపుచ్చింది. తమకు లభించిన ఆధారాలను బట్టి పోలీసులు అరెస్ట్ చేసిన సంజయ్ రాయ్‌కి మాత్రమే ఇందులో సంబంధం ఉందని శుక్రవారం సీబీఐ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసి సోదాలు నిర్వహించింది. ఆయన హయాంలో మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు దాడి చేశారు. ఆయనకు సన్నిహితులైన ముగ్గురి నివాసాలపై కూడా ఈడీ దాడులు చేసింది.

ముక్కులో వేలు పెట్టుకొంటే మతిమరుపు ముప్పు!

న్యూయార్క్, సెప్టెంబర్ 6: ముక్కులో వేలు పెట్టుకొనే అలవాటు ఉంటే వెంటనే మానేయండి. లేకపోతే మీకు మతిమరుపు వచ్చే ప్రమాదం ఉన్నదట. ముక్కులో వేలు పెట్టుకొన్నప్పుడు మెదడుకు, ముక్కుకు అనుసంధానమై ఉండే నాళం (నాసల్ ఎపిథీలియం) ద్వారా బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ మెదడులోకి చేరి మెదడు కణాలను దెబ్బతీస్తాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ ది మెడికల్ సైన్సెస్‌లో ప్రచురితమైన అధ్యయనంలో పేర్కొన్నారు.

కాంతి ప్రసరణతో సూపర్ కెపాసిటర్ చార్జింగ్

బెంగళూరు, సెప్టెంబర్ 6: బెంగళూరులోని ఐఐఎస్సీ ఇనుస్ట్రుమెంటేషన్ అండ్ అప్లయిడ్ ఫిజిక్స్ విభాగం పరిశోధకులు సరికొత్త సూపర్ కెపాసిటర్‌ను అభివృద్ధి చేశారు. దీనిపై కాంతిని ప్రసరింపజేస్తే చాలు.. రీచార్జ్ అవుతుంది. వీధి బల్బులు, వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఈ సూపర్ కెపాసిటర్లను వినియోగించవచ్చునని బెంగళూరులోని ఐఐఎస్సీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కెపాసిటర్ అనేది విద్యుత్తు శక్తిని నిల్వ చేసే పరికరం. సాధారణ కెపాసిటర్‌తో పోల్చితే ఎన్నో రెట్లు సామర్థ్యం కలిగినదే..'సూపర్ కెపాసిటర్'. సెల్ ఫోన్లలో పవర్ చిప్స్‌గా కూడా వీటిని వాడొచ్చు.

అగ్ని-4 క్షిపణి పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ పరీక్షను భారత్ శుక్రవారం విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యస్థ రేంజ్ క్షిపణి అయిన అగ్ని-4ను ఒడిశాలోని చాందీపూర్‌నుంచి ప్రయోగించినట్టు అధికారులు తెలిపారు.భారత న్యూక్లియర్ కమాండ్ అథారిటీలో భాగమైన స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ దీనిని నిర్వహించిందన్నారు. అగ్ని-4తో లక్ష్య పరిధి మరింత పెరిగింది. 4 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఇది ఛేదిస్తుంది. 20 మీటర్ల పొడవున్న ఈ క్షిపణి వెయ్యి కేజీల పేలోడ్‌ను మోసుకుపోగలదు.





లాల్‌బాగ్ గణపతికి 20 కిలోల బంగారు కిరీటం

ముంబై, సెప్టెంబర్ 6: ముంబైలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు పేరొందిన లాల్‌బాగ్ గణపతి(లాల్‌బాగ్‌చా రాజా)కి రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ 20 కిలోల బంగారు కిరీటాన్ని సమర్పించారు. గత 15 ఏండ్లుగా ఏటా లాల్‌బాగ్ గణపతి ఉత్సవాల్లో అనంత్ అంబానీ చురుగ్గా పాల్గొంటున్నారు. ఉత్సవ కమిటీకి సైతం ఆయన ఎగ్జిక్యూటివ్ అడ్వైజర్‌గా ఉన్నారు. కాగా, ఈ ఏడాది లాల్‌బాగ్ గణపతి విగ్రహ రూపాన్ని గురువారం ఆవిష్కరించారు.


పంతుళ్ల పల్లె!



బెంగళూరు, సెప్టెంబర్ 6: విద్య లేని వాడు వింత పశువు అన్నారు. అందుకేనేమో.. ఈ గ్రామంలో అందరూ విద్యావంతులే కాదు.. విద్య నేర్పేవారు ఇంటికొకరు ఉన్నారు. అందుకే ఈ గ్రామాన్ని 'పంతుళ్ల పల్లె' అని కూడా పిలుస్తుంటారు. ఇంచల్.. కర్ణాటకలోని బెళగావి జిల్లా సావడట్టి తాలూకాలోని ఓ గ్రామం. గ్రామ జనాభాలో పది శాతం అనగా 600 మంది ఉపాధ్యాయులు గ్రామంలోని దాదాపు ప్రతి కుటుంబంలో ఒకరు ఉపాధ్యాయ వృత్తిని తమ జీవనోపాధిగా ఎంచుకోవడం విశేషం. సిద్ధ సంస్థాన్‌కు చెందిన ఆధ్యాత్మిక గురువు డాక్టర్ శివానంద భారతి స్వామీజీ దూరదృష్టితో చేపట్టిన చర్యలే నేడు ఆ గ్రామంలో విద్యా కుసుమాలు పరిమళాలు వెదజల్లుతున్నాయి. 1970 దశకంలో ఆ గ్రామంలో ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాల ఉండేది. ఇక్కడ ఉన్నత విద్యా సంస్థల ఆవశ్యకతను గుర్తించిన డాక్టర్ శివానంద భారతి మరికొందరు నిబద్ధతగల టీచర్లతో కలిసి ఓ విద్యా సొసైటీని స్థాపించారు. ఇక్కడ 1984లో గ్రామీణ ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రం ఏర్పడింది. ఈ కేంద్రంలో ఇంచల్ గ్రామానికి చెందిన వారికి ఉచితంగా శిక్షణ, భోజనం సదుపాయం కల్పించారు. 1988 నుంచి సగటున ప్రతి ఏడాది ఇంచల్‌కు చెందిన 20 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందేవారు.

దేశ సేవలోనూ ముందంజ

దేశ ప్రజలను విద్యావంతులను చేయడం ఎంత ముఖ్యమో.. దేశ రక్షణ కూడా అంతే ప్రాధాన్యం గలదని ఇంచల్‌వాసులు గుర్తించారు. దీంతో చాలా మంది యువకులు దేశ సైన్యంలో చేరేందుకు సిద్ధపడ్డారు. ఇంచల్ గ్రామానికి చెందిన 300 మందికిపైగా యువకులు నేడు దేశ త్రివిధ దళాల్లో సేవలందిస్తున్నారు.



9 కోట్ల రాయిని మెట్టుగా వాడుకొంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: ప్రపంచంలోనే ఇప్పటివరకు ఉన్న వాటిల్లో అతిపెద్దదైన అంబర్ శిలాజాన్ని రొమేనియాలో విచిత్రమైన పరిస్థితిలో గుర్తించారు. చెట్ల నుంచి వెలువడే ఒక రకమైన స్రావం గట్టిపడి, కొన్ని వేల సంవత్సరాల తర్వాత అంబర్ శిలాజంగా ఏర్పడుతుంది.దాదాపు 3.8 నుంచి 7 కోట్ల సంవత్సరాల క్రితం నాటి ఎర్రటి రాయి(అంబర్ శిలాజం) రొమేనియాలోని కోల్టి అనే గ్రామానికి చెందిన ఓ బామ్మకు దొరికింది. సుమారుగా 3.5 కిలోలున్న ఈ రాయిని గుమ్మం ముందు మెట్టుగా ఆమె కొన్నేండ్లపాటు వాడింది. ఆమె ఇంట్లో చోరీకి వచ్చిన దొంగలు సైతం దాని ప్రత్యేకతను గుర్తించలేకపోయారు. చివరికి ఆ బామ్మ తరపు బంధువు ఒకరు దానిని గుర్తించారు. దాని విలువ రూ.9.2 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.



వాహనాల శబ్దాలతో పురుషులకు వంధ్యత్వం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): వాహనాలు చేసే పెద్ద శబ్దాలు పురుషుల సంతానోత్పత్తి సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని డెన్మార్క్ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనంలో తేలింది. వాహన శబ్దాల కారణంగా 37 ఏండ్లు పైబడిన పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. శబ్ద కాలుష్యం కారణంగా 35 ఏండ్లు పైబడిన మహిళల సంతానోత్పత్తి సామర్థ్యంపై కూడా ప్రభావం పడుతున్నట్టు వెల్లడించారు. దీనికి గల శాస్త్రీయ కారణాలపై లోతైన పరిశోధనలు చేస్తున్నట్టు తెలిపారు. మరోవైపు ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వచ్చే పెద్ద శబ్దాల వల్ల మనుషుల్లో రక్తపోటు పెరుగుతున్నట్టు యూకే పరిశోధకులు తెలిపారు.

ధాన్యం అక్రమాలపై రాష్ట్రానికి నోటీసులు

బీఆర్ఎస్ నేత పెద్ది పిల్‌పై హైకోర్టు స్పందన

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యాన్ని ప్రైవేట్ కంపెనీలకు విక్రయించడంలో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి చేపట్టిన న్యాయపోరాటంలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఈ–వేలంలో ధాన్యాన్ని దక్కించుకున్న ప్రైవేటు కంపెనీలకు కూడా తాఖీదులు అందాయి. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. ఈ కేసులో ప్రతివాదులైన పౌరసరఫరాలశాఖ ముఖ్యకార్యదర్శి, పౌరసరఫరాల సంస్థ ఎండీ, కమిషనర్, జనరల్ మేనేజర్, మార్కెటింగ్ జనరల్‌మేనేజర్, భారత ఆహార సంస్థ, ఈ–టెండరు దక్కించుకున్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫార్మర్స్, మంచుకొండ ఆగ్రోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, హిందుస్థాన్ ఎంటర్‌ప్రైజెస్, ఎల్జీ అగ్రి ఇండస్ట్రీస్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఖజానాకు 1100 కోట్ల నష్టం

దాన్యం కొనుగోలుకు నిర్వహించిన టెండర్‌లో పేర్కొన్నదాని కంటే మిల్లర్ల నుంచి అదనంగా వసూలు చేయడంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, పౌరసరఫరాల సంస్థ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ, ధాన్యం కొనుగోలు టెండర్ల ద్వారా భారీ నష్టం వచ్చేలా చేసిన అధికారులపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదని చెప్పారు. దీనిపై పిటిషనర్ ఫిర్యాదు చేసినా ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏజన్సీల మధ్య జరిగిన ఒప్పందంలో అవకతవకల ఫలితంగా రూ.1100 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపారు.

అక్రమాల వెనుక పెద్దల హస్తం: పెద్ది



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని పెద్ది సుదర్శన్‌రెడ్డి చెప్పారు. నర్సంపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బిడ్డర్ ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా పూర్తి చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నట్టు బీఆర్ఎస్ రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఈ వ్యవహారంలో పెద్దల హస్తం ఉన్నదని, నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

వడ్ల కుంభకోణం జరిగిందిలా..

బీఆర్ఎస్ హయాంలో సేకరించిన రూ.7 వేల కోట్ల విలువచేసే 35 లక్షల టన్నుల ధాన్యం అమ్మకాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలిచింది. స్థానిక మిల్లర్లు ధాన్యాన్ని క్వింటాకు రూ.2,100 చొప్పున కొంటామని చెప్పినా, వారికి ఇవ్వకుండా టెండర్లు పిలిచింది. రూ.1,885 నుంచి రూ.2,007 కోట్ చేసిన కేంద్రీయ భండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందుస్థాన్ కంపెనీ, నకాఫ్ సంస్థలు దాన్యాన్నిదక్కించుకున్నాయి. ఈ నాలుగు సంస్థలు గోదాముల్లోని ధాన్యాన్ని తీసుకెళ్లకుండా క్వింటాకు రూ.2,230 చెల్లించాలని రాష్ట్రంలోని 4,000 రైస్ మిల్లర్లను బ్లాక్ మెయిల్ చేశాయి. 35 లక్షల టన్నుల ధాన్యానికి సగటున క్వింటాకు కనీసం రూ.200 చొప్పున అదనంగా వసూలు చేసినా రూ.700–800 కోట్లు అవుతుంది. ప్రభుత్వ పెద్దలే కావాలని తక్కువకు గ్లోబల్ టెండర్లు పిలిచి కట్టబెట్టారని, ఇందులో రూ.700 కోట్లు నుంచి 800 కోట్ల వరకు స్కామ్ జరిగిందని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తోపాటు బీజేపీకి కూడా ఆరోపించింది. గత ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో 1.60 లక్షల టన్నుల సన్నబియ్యం ఉంటే వాటిని రూ.22కు అమ్మి అవే బియ్యాన్ని ఈ నాలుగు సంస్థల నుంచి కిలోకు రూ.57 చొప్పున కొన్నది. ఇందులో రూ.300 కోట్ల కుంభకోణం చోటుచేసుకున్నదని విపక్షాలు మండిపడ్డాయి.



ఫార్మాసిటీకి భూములిచ్చేది లేదని అధికారులకు తెగేసి చెప్తున్న న్యాల్‌కల్ మండలం డప్పూర్‌కు చెందిన మహిళా రైతులు

ఫార్మాసిటీకి భూమిలియ్యం

అధికారులకు తెగేసి చెప్పిన రైతులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 6: ప్రాణాలు పోయినా సరే ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డి, డప్పూర్, మల్గి గ్రామాలకు చెందిన రైతులు స్పష్టం చేశారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం డప్పూర్‌లో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, రైతులతో సమావేశమయ్యారు. భూసేకరణపై వారితో చర్చించారు. బాధిత రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామాల పరిధిలో రెండు వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గుట్టుచప్పుడు కాకుండా అధికారులు సర్వే చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. భూములను సేకరించేందుకు గ్రామ సభలు నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించడం సరికాదని అన్నారు. జీవనాధారమైన పచ్చని భూముల్లో ఏడాదికి రెండు, మూడు పంటలను పండిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్టు చెప్పారు. అలాంటి భూములను ఫార్మాసిటీకి ఇచ్చి.. తాము చావాలా? అని మహిళా రైతులు ప్రశ్నించారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో కాలుష్యం ఏర్పడి తమ ప్రాంతం దెబ్బతినడంతోపాటు ఆరోగ్యాలు పాడయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. భూసేకరణకు ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడితే భయపడేది లేదని హెచ్చరించారు. ప్రాణాలు పోయినా భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ ప్రాతంలో ఫార్మాసిటీ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు. బాధిత రైతుల సమస్యలను కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్తానని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

- **ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు**
- **వివరణకు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసిన జస్టిస్ కే లక్ష్మణ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లిలో ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తారో లేదో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం వివరణ ఇచ్చేందుకు చివరి అవకాశాన్ని ఇస్తున్నామని, మరోసారి అవకాశం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ఫార్మా సిటీ ఏర్పాటు కోసం సేకరించిన భూముల పరిహార అవార్డు చెల్లదంటూ సింగిల్ జడ్జి తీర్పు వెలువరించినందున తమ భూములపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మేడిపల్లికి చెందిన దాదాపు 50 మంది దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఏ దివ్య వాదనలు వినిపిస్తూ.. అక్కడ బల్క్‌డ్రగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం లేదని, లైఫ్‌సైన్సెస్ పరిశ్రమలను ఏర్పాటు చేయించాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నారని చెప్పారు. దీంతో ఏ అధికారి ఆ వివరణ ఇచ్చారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది.

- **సారూ.. సుద్దాల ఇప్పుడు గుర్తొచ్చిందా?**



మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సుద్దాల గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే వివేక్ వెంకస్వామిని మహిళలు నిలదీశారు. 'సారూ.. మా సుద్దాల గ్రామం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా?' అంటూ సమస్యలను ఏకరువు పెట్టారు. 'సుద్దాల వాగు మీద వంతెన లేక మస్తు తిప్పలు పడుతున్నం. మీరు ఎంపీగా గెలిచినప్పుడే బ్రిడ్జి కడుతమని చెప్పిన్రు. ఇప్పటి దాకా కట్టకపోతిరి. ఊర్లో కరెంట్ బుగ్గలు లేవు. విష జ్వరాలు వచ్చి మంచం పట్టినా ఒక్క వైద్య శిబిరం కూడా పెట్టకపోతిరి. గత ప్రభుత్వంలో అధికారులు మంచిగ పనిచేసిన్రు. ఇప్పుడు మరీ అధ్వానంగా ఉన్నది' అంటూ ఒక్కో సమస్యపై నిలదీశారు. త్వరలో సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతానని చెప్పిన ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు.
–చెన్నూర్ రూరల్

పడగ విప్పిన లోన్ యాప్స్

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా అరునక్కనగర్‌లో నివసించే ఎన్ శ్రీకాంత్ (29) ప్రైవేట్ లోన్‌యాప్‌లో సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. ఒక నెల ఈఎంఐ కట్టకపోవడంతో లోన్ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఓ వైపు అప్పటికే చేసిన కొన్ని అప్పులు తీర్చలేక, మరోవైపు లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులను తట్టుకోలేక శ్రీకాంత్ గత నెల 24న సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య చేసుకున్నాడు.

- **ఈఎంఐ చెల్లింపు ఒక్కరోజు ఆలస్యమైనా వేధింపులే**
- **జనాన్ని పీడించి ప్రాణాలు తీస్తున్న వైనం**
- **ఈ ఏడాది ఇప్పటికే 32 మంది వరకు ఆత్మహత్య**
- **ప్రభుత్వ నియంత్రణలేక కుటుంబాలు ఛిన్నాభిన్నం**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): సోషల్ మీడియాలో లోన్ యాప్స్ మళ్లీ పడగ విప్పుతున్నాయి. వాటి నిర్వాహకులు ఆకర్షణీయమైన ప్రకటనలతో వలవేసి, తక్కువ వడ్డీకే రుణాలిస్తామంటూ ఎంతో మందిని, ముఖ్యంగా యువతను తమవైపు తిప్పుకుంటున్నారు. ఎలాంటి షరతులు పెట్టకుండానే అప్పులు ఇస్తున్నారు. వారి నుంచి రుణాలు తీసుకున్న వారు ఈఎంఐ చెల్లించడంలో ఒక్కరోజు ఆలస్యమైనా ప్రాణాలు తోడేస్తున్నారు.



పదే పదే అవే యాడ్స్

అనధికారిక లోన్ యాప్స్ సోషల్ మీడియాలో విచ్చలవిడిగా ప్రకటనలు గుప్పిస్తున్నాయి. వాటిని ఎవరైనా చూసినా, చదివినా, లైక్ చేసినా.. పదే పదే అలాంటి యాడ్స్‌తో కవ్విస్తున్నాయి. తక్కువ వడ్డీని ఆశచూపుతూ లోన్ తీసుకునేలా టెంప్ట్ చేస్తున్నాయి. ఆర్థిక అవసరాల కోసం వాటి వలలో పడి ఒకసారి లోన్ ప్రాసెస్ మొదలుపెడితే సమస్యలను ఆహ్వానించినట్టే. ప్రతి దశలోనూ వారికి మన ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన అనుమతులు ఇస్తూనే ఉండాలి. లేకపోతే లోన్ ప్రాసెస్ ముందుకెళ్లదు. ఇలా మన కాంటాక్ట్స్, ఫొటోలు, రికార్డింగ్ వీడియోలు, వాయిస్ రికార్డింగ్‌లు, లొకేషన్, కెమెరా పర్మిషన్స్, ఫోన్‌లోని ఇతర యాప్స్ పర్మిషన్స్ అన్నీ వారి గుప్పిట్లోకి తెచ్చుకున్న తర్వాత ప్రాసెసింగ్ ఫీజు, ఈఎంఐ ఫీజులతో కలిపి డబ్బులు మన అకౌంట్‌లో జమ చేస్తారు.

వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు

లోన్ యాప్స్ నిర్వాహకులకు ఈఎంఐ చెల్లింపు ఒక్కరోజు ఆలస్యమైనా మన కాంటాక్ట్ లిస్టులోని బంధువులకు ఫోన్లు చేస్తుంటారు. మన ఫోన్ గ్యాలరీలోని ఫొటోలను మార్ఫింగ్ చేసి మిత్రులకు, బంధువులకు పంపుతుంటారు. తీసుకున్న అప్పు చెల్లించడం చేతకాని వాడంటూ మనపై ముద్రవేస్తారు. దీంతో పరువు పోయి ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 32 మంది ఆత్మహత్య చేసుకున్నట్టు సైబర్ నిపుణులు చెప్తున్నారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో చర్యలేవి?

మానసికంగా వేధించి ఎంతో మంది ప్రాణాలను తోడేస్తున్న లోన్ యాప్స్ నిర్వాహకులపై, సోషల్ మీడియాలో ఆ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో సైతం ఈ దారుణలపై దృష్టిపెట్టడం లేదు. దీంతో లోన్ యాప్‌ల ఆగడాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి.

అధిక లాభాల కోసం ఆశపడి

అప్పుల్లో కూరుకుపోయి విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 6: అధిక లాభాల కోసం ఆశపడిన ఓ విద్యార్థి లోన్ యాప్‌లో పెట్టుబడి పెట్టి, మోసపోయి చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మద్దూర్‌కు చెందిన రుమాండ్ల భానుప్రకాశ్ (22) తల్లి కృష్ణవేణితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. రామాంతాపూర్‌లోని అరోరా కళాశాలలో ఎంసీఏ చదువుతున్న భానుప్రకాశ్.. టెలిగ్రామ్ యాప్ ద్వారా తనకు వచ్చిన సందేశాలను చూసి ఓ లోన్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. ఆరంభంలో మంచి లాభాలు రావడంతో దాదాపు రూ.65 వేలు డిపాజిట్ చేశాడు. కానీ, ఆ నగదుతోపాటు లాభం తన ఖాతాలో జమకాకపోవడంతో మెసేజ్ ద్వారా ఆ లోన్ యాప్ నిర్వాహకులను సంప్రదించాడు. దీంతో భానుప్రకాశ్ ఖాతాలో రూ.10 లక్షల బ్యాలెన్స్ ఉంటేనే డిపాజిట్, లాభం వస్తుందని లేకుంటే ఆ సొమ్ము రాదని లోన్ యాప్ నిర్వాహకుల నుంచి సమాధానం వచ్చింది. ఈ క్రమంలో బంధుమిత్రుల అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన భానుప్రకాశ్ గురువారం రాత్రి తన తల్లికి చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం భానుప్రకాశ్ ఆచూకీ కోసం గూగుల్ యాప్ ద్వారా వెతకడంతో జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ చెరువు వద్ద అతని ఫోన్ లొకేషన్‌ను చూపించింది. అక్కడ చెరువు కట్టపై ద్విచక్రవాహనంలో అతని సెల్‌ఫోన్, ఇతర వస్తువులు ఉన్నప్పటికీ భానుప్రకాశ్ మాత్రం కనిపించలేదు. దీనిపై శుక్రవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. ఫాక్స్‌సాగర్ చెరువు నుంచి భానుప్రకాశ్ మృతదేహాన్ని వెలికితీసి, గాంధీ దవాఖానకు తరలించారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

గురువెవరు, శిష్యుడెవరు?



కనకదుర్గ దంటు
89772 43484

గురు, శిష్య పరంపర సనాతన ధర్మంలో ఒక ముఖ్యమైన అంశం. ఒక్కొక్కసారి గొప్ప గురువుకు మంచి శిష్యులు దొరకరు. అటు ఉత్సాహవంతులైన శిష్యులున్నా గురువు దొరకకపోవచ్చు. వారిద్దరి ప్రకృతిలో, ఆలోచనల్లో తేడాలుండవచ్చు. కొద్ది ఉదాహరణల్లో శిష్యులు ఎంత గొప్పవారుగా తేలుతారంటే, వారి గురువుల పేర్లు ప్రజలకు తెలియవు. శిష్యుల పేర్లే తెలుస్తాయి. ఆదిశంకరాచార్యులవారి పేరు చాలామందికి తెలుసు. వారి గురువు గోవింద భగవత్పాదులు అని ఎంత మందికి తెలుసు? త్యాగరాజువారి గురువు సొంఠి వెంకటరమణయ్య అని ఎందరికి తెలుసు? అద్భుత రాజకీయ నీతిజ్ఞుడు అటల్ బిహారి వాజపేయి గురువు ఎవరికైనా తెలుసా?

ఏ రంగంలోనైనా ఎవరి ప్రతిభను బట్టి వారు రాణిస్తారు. తమ మేధ, అనుభవం, జీవితాన్ని పరిశీలించిన విధానాన్ని బట్టి వారి ప్రతిభ బయటకు వస్తుంది. గురుశిష్యులకు ఒకేరకమైన పోటీపెడితే తెలుస్తుంది ఎవరి ప్రతిభ ఏమిటో? నందమూరి తారక రామారావు మీద అభిమానంతో, కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పరంపరతో విసిగి కేసీఆర్ 1982లో తెలుగుదేశం పార్టీలో చేరారు. జాతీయ పార్టీలకు రాష్ట్రాల గురించిన అవగాహన పూర్తిగా ఉండదని, ప్రాంతీయ పార్టీ అయితే ప్రజల అవసరాలు త్వరగా గుర్తించడం, తీర్చడం జరుగుతుందని ఆయన భావించారు. పదేండ్ల తర్వాత తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్‌ను దించి ముఖ్యమంత్రి పదవి ఆక్రమించిన చంద్రబాబు నాయుడి పార్టీలో కేసీఆర్ ఉండిపోవలసి వచ్చింది. అయితే చాలా నిజాయితీగా పార్టీ కోసం జన్మభూమి, ప్రజల వద్దకు పాలన వంటి పథకాలను రూపొందించి చంద్రబాబుకు సహాయం చేశారు. అయితే తరచుగా కేసీఆర్ తన శిష్యుడని చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటు.

చరిత్రలో విచిత్రమైన విషయాలు జరుగుతాయి. తెలంగాణ అన్న పదాన్ని అసెంబ్లీలో ఉచ్చరించకుండా నిషేధించిన చంద్రబాబు అహంకారాన్ని, తెలంగాణకు అప్రతిహతంగా జరుగుతున్న అన్యాయాన్ని చూసి, అవినీతిపరుడైన చంద్రబాబు పార్టీని వదిలి, కేవలం తెలంగాణ ప్రజల కోసం మరో పార్టీని స్థాపించి, 14 ఏండ్లు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు కేసీఆర్. చంద్రబాబు ఎట్లా ముఖ్యమంత్రి అయ్యారో, తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు చేసి కేసీఆర్ ఎట్లా ముఖ్యమంత్రి అయ్యారనే చరిత్ర ప్రజల కండ్లముందే ఉన్నది.

నిజానికి విచిత్ర సన్నివేశం ఏమంటే.. రాష్ట్రాలు విడిపోయాక ఇటు తెలంగాణకు కేసీఆర్, అటు ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ముఖ్యమంత్రులు కావడం. కేంద్రమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న కేసీఆర్ మొట్టమొదటిసారి రాష్ట్ర అధినేత అయ్యారు. అప్పటికే 36 ఏండ్ల రాజకీయ అనుభవం, 9 ఏండ్లు ముఖ్యమంత్రిగా పాలించిన అనుభవం ఉన్న నాయకుడు చంద్రబాబు. మరి 2014 నుంచి 2019 దాకా (రెండోసారి ఆంధ్రా ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయారు కాబట్టి) ఈ ఇద్దరు నాయకుల పాలన ఎలా ఉండింది?

అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల లాగా పరిగెత్తించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో కేసీఆర్ నిలిపారు. ముందుగా కరెంట్ కష్టాలు తొలగించి ప్రజలందరికీ మేలు చేశారు. తర్వాత చెరువుల పునరుద్ధరణ, నీటిపారుదల కల్పించి వ్యవసాయరంగాన్ని వృద్ధిపరిచారు. కేవలం ఎనిమిదేండ్లలో 56 లక్షల ఎకరాల నుంచి 1.65 కోట్ల ఎకరాల్లో పంట పండించారు సంతోషంగా తెలంగాణ రైతులు.



విద్యారంగంలో దాదాపు 1200 గురుకులాల స్థాపన, వైద్యరంగంలో ఆసుపత్రులను పటిష్ఠం చేయడం, కేసీఆర్ కిట్ వంటి పథకాలు సామాన్యుడికి ఊరటనిచ్చాయి. ముసలివారికి పింఛన్లు, ఆడపిల్ల పెండ్లికి కల్యాణలక్ష్మి వంటి పథకాలే కాకుండా, అవసరమైన నిర్మాణాలు రికార్డు సమయంలో పూర్తిచేశారు. రూ.720 కోట్లతో సచివాలయ భవనం, జిల్లాల్లో కలెక్టరేట్లు, పార్కులు, వైకుంఠధామాలు, బీదవారికి విద్యాదానం, డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితబంధు, బీసీ బంధు వంటి పథకాలు అమలుపరిచారు. కుల, మత భేదాలు లేకుండా సనాతన ధర్మంలో చెప్పిన సమానత్వాన్ని పాటించిన నేత కేసీఆర్.

ఇక చంద్రబాబు ఐదేండ్లలో ఒక్క రాజధానికి కావలసిన శాసనసభా భవనం గాని, హైకోర్టు గాని నిర్మించలేకపోయారు. సింగపూర్ నుంచి రాజమౌళి దాకా రకరకాల పేర్లు రంగప్రవేశం చేశాయి. కానీ, ఒక్క నిర్మాణం పూర్తికాలేదు. ప్రజలకు ప్రమాణం చేసిన ఉద్యోగ కల్పన పూర్తికాలేదు. పదేండ్ల తర్వాత నీటమునిగిన అమరావతికి పడవల్లో వెళ్లవలసి రావడమే తప్ప, అక్కడ ఏం జరుగుతున్నదో ఎవరికీ పాలుపోవడం లేదు. జగన్ ప్రతిపాదించిన వికేంద్రీకరణ, మూడు రాజధానులు ముందుకు వెళ్లకుండా ఐదేండ్లు కేసుల మీద కేసులు వేసి ఆయన ఉత్సాహాన్ని నీరుగార్చారు. చివరికి విడిపోయి పదేండ్లయినా ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని మటుకు ఏర్పడలేదు. ఇది ఎవరి పాపం!

ఆంధ్ర ప్రజలకు ఇంకో అపోహ ఉన్నది. అది తొలగిపోవాలి. వారి నాయకులు ఆంధ్రా నుంచి నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని మేధావులు అనుకునేవాళ్లు కూడా మాట్లాడతారు. నిజానికి హైదరాబాద్‌లో తెలంగాణ నిధులతో ఆంధ్రా నాయకులు, వ్యాపారస్థులు కోటీశ్వరులు అయ్యారు. అంతేకానీ, తెలంగాణకు వారు చేసిందేమీ లేదు. హైదరాబాద్ నగరం 400 ఏండ్ల నుంచీ ప్రపంచంలోనే ఐదవ అద్భుత నగరంగా ఉన్నది. పైగా ఉమ్మడి రాష్ట్ర ఆదాయం చూసినా ఈ విషయం అర్థమవుతుంది. తెలంగాణ జిల్లాల ఆదాయం 66 శాతం, హైదరాబాద్ ఆదాయం 10 శాతం కలిపి ఈ ప్రాంతం 1957 నుంచి 2014 దాకా రాష్ట్రానికి 76 శాతం ఆదాయాన్నిచ్చింది. ఆంధ్రా ప్రాంతం 17 శాతం, రాయలసీమ 7 శాతం ఆదాయాన్నిచ్చాయి. ఇవన్నీ ప్రభుత్వ లెక్కలే. మరి ఎవరి సొమ్ము ఎవరు తిన్నారు? ఆంధ్రా ప్రజలు వారి నాయకులను అడగాల్సిన ప్రశ్న ఇది. ఇరవై ఏడున్నరేండ్లు రాయలసీమ ప్రాంతం వారు, ఇరవై నాలుగున్నరేండ్లు ఆంధ్రా ప్రాంతం వారు ముఖ్యమంత్రులుగా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆ రెండు ప్రాంతాల నగరాలను ఎందుకు హైదరాబాద్ లాగా తయారుచేయలేదు? అని. ఈ ఆదాయమంతా ఏమైంది? అని.

ఆంధ్ర ప్రజలకు ఇంకో అపోహ ఉన్నది. అది తొలగిపోవాలి. వారి నాయకులు ఆంధ్రా నుంచి నిధులు తెచ్చి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని మేధావులు అనుకునేవాళ్లు కూడా మాట్లాడతారు. నిజానికి తెలంగాణ నిధులతో ఆంధ్రా నాయకులు, వ్యాపారస్థులు హైదరాబాద్‌లో కోటీశ్వరులు అయ్యారు. అంతేకానీ, తెలంగాణకు వారు చేసిందేమీ లేదు. హైదరాబాద్ నగరం 400 ఏండ్ల నుంచీ ప్రపంచంలోనే ఐదవ అద్భుత నగరంగా ఉన్నది. పైగా ఉమ్మడి రాష్ట్ర ఆదాయం చూసినా ఈ విషయం అర్థమవుతుంది.

ఇక ఇప్పుడు ఆంధ్రా రాజధాని విషయానికి వస్తే.. చంద్రబాబు ఆలోచనలు వేరుగా ఉండవచ్చు. 46 ఏండ్ల అనుభవంతో కేసీఆర్‌ను మించిన అద్భుతాలు చేయవచ్చు. కేసీఆర్ 650 మీటర్ల ఎత్తుకి నదీజలాలు తీసుకెళ్లగలిగిన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినప్పుడు.. ఆయన గురువునని చెప్పుకొనే చంద్రబాబు నాయుడు బహుశా 650 మీటర్లు భూమి అడుగున రాజధానిని నిర్మిస్తారేమో! అప్పుడు పైన నీళ్లున్నా సబ్‌మెరైన్లలో అమరావతికి చేరుకోవచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ఆశ్చర్యపోయిన అమెరికా శాస్త్రజ్ఞులు.. ద్వారకా నగరం ఇప్పుడున్నట్టు నీళ్ల కింద ఉన్న అద్భుత అమరావతిని చూసి మూర్ఛపోతారేమో! ఎవరు చూశారు!

నివాళి



గులాబీ గళం ఉద్యమ బలం

కొందరు రాజకీయంగా ఎంత పెద్ద పదవులు అనుభవించినా.. ప్రజల్లో వారికి అంతగా ఆదరణ ఉండదు. పదవి పోగానే సహజంగా ఆ రాజకీయ నాయకుడు ప్రజలకు దూరంగా ఉండాలని చూస్తాడు. అలా పదవులు అనుభవించినంత కాలం ప్రజల్లో ఉండి హోదా, పలుకుబడి రాగానే మానవత్వాన్ని మరిచే రాజకీయ నాయకులు ఎందరో. కొందరు అలా కాదు. రాజకీయ పదవులు చేపట్టకపోయినా.. వారు చేసిన ప్రజా సేవలను బట్టి చరిత్రలో వారికంటూ ఓ గుర్తింపు ఉంటుంది. అటువంటి గొప్ప ప్రజా సారథి, సేవకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి.



సంపత్ గడ్డం

తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాదు, అంతకుముందునుంచే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జిట్టా బాలకృష్ణారెడ్డి ఎంతగానో పరితపించేవారు. నల్లగొండ జిల్లాలో పుట్టిన ఆయన తన జన్మభూమి ఎదపై గుదిబండగా మారిన ఫ్లోరైడ్ రక్కసిని తరిమికొట్టేందుకు అహర్నిశలు శ్రమించారు. భువనగిరి నియోజకవర్గవ్యాప్తంగా తాగునీటి వాటర్ ప్లాంట్లను ప్రారంభించి నిజమైన సేవకుడినని నిరూపించుకున్నారు. రాజకీయంగా కలిసి వస్తే విధానపరమైన నిర్ణయాలతో ప్రజలకు మరింతగా సేవ చేయాలని ఆయన సంకల్పించారు. కానీ, ఆయన అనుకున్నది జరగలేదు. అయినప్పటికీ ఏనాడూ ఆయన ప్రజలకు దూరం కాలేరు. ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ జిట్టా ఉండేవారు.

ప్రజాప్రతినిధి కాలేకపోయినా, ప్రజా నాయకుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న జిట్టా తెలంగాణ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు. 2001లో కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ మలివిడత ఉద్యమం ప్రారంభం కాగానే నల్లగొండ నుంచి తొలి పిడికిలి ఎత్తింది జిట్టానే. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత యువజన విభాగానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆనాడే ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ శకటాన్ని ప్రదర్శించేలా ఆయన కృషిచేశారు. నల్గొండ వ్యాప్తంగా ఉద్యమ నిర్మాణ జెండా గద్దెలు నిర్మించి ఊరూరా చైతన్యం నింపిన నిస్వార్థ సేవకుడు.

అంతేకాదు, స్వరాష్ట్ర సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో తన ఆస్తులను ధారపోశారు జిట్టా. వందల కోట్ల రూపాయల ఆస్తులను ప్రజా ఆకాంక్షల కోసం త్యాగం చేశారు. ఉద్యమానికి సర్వస్వం అర్పించిన జిట్టాకు రాజకీయంగా మాత్రం ఏదీ కలిసిరాకపోవడం విచారకరం. దీంతో రాజకీయ సమీకరణాల కారణంగా 2009లో ఆయన టీఆర్ఎస్‌ను వీడాల్సి వచ్చింది. అయితే ఏ పార్టీలో చేరినా ఆయనకు మోసమే ఎదురైంది. ఈ నేపథ్యంలో ఆయనే స్వయంగా యువ తెలంగాణ పార్టీని స్థాపించి రాజకీయంగా మార్పు తేవాలని భావించారు. అడుగడుగునా అణచివేత, స్వార్థంతో నిండిన ఈ రాజకీయ వ్యవస్థలో ఆయన ఇమడలేకపోయారు. నిఖార్సయిన తెలంగాణవాదిగా ఉండి మోసపోయానని గుర్తించిన జిట్టా 2018లో మళ్లీ ఉద్యమ పార్టీలో చేరారు.

కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని భావించిన జిట్టా మరోసారి గులాబీ పార్టీ తరపున గళమెత్తారు. బహుశా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆయనకు సముచితమైన స్థానం దక్కేదేమో. స్వల్ప తేడాతో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ప్రత్యక్షంగా రాజకీయ సేవ చేసే అవకా శం రాలేదు. కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం ఉంచి, ప్రజా సేవ చేస్తున్న ఆయనను అనారో గ్యం వెంటాడింది. కాలం కలిసివచ్చే సమయానికి నిస్వార్థ సేవకుడిని ప్రజలకు దూరం చేసింది.

స్వరాష్ట్ర సాధన కోసం జిట్టా బాలకృష్ణారెడ్డి చేసిన కృషి చరిత్రాత్మకం. ఆయన సేవలను తెలంగాణ ప్రజలు, మరీ ముఖ్యంగా ఉద్యమాల గడ్డ నల్లగొండ ప్రజలు ఎన్నటికీ మరువరు. అలుపెరగని ప్రజానాయకుడిగా ఆయన తెలంగాణ చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. భువనగిరి గడ్డ జిట్టా బాలకృష్ణారెడ్డికి రాజకీయంగా అండగా నిలబడకపోయినా.. ప్రజల కోసం పరితపిస్తూ ఆయన చేసిన సామాజిక సేవ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మలిదశ ఉద్యమంలో జిట్టా బాలకృష్ణారెడ్డి చూపిన చొరవ, చైతన్యం, నాయకత్వాన్ని భవిష్యత్తు తరాలు పదిలంగా దాచుకుంటాయి.

లేఖ

ఆదర్శ అధ్యాపకుల అభ్యర్థన ఆలకించరూ!

ఒక అధ్యాపకుడు ఒకే విద్యాసంస్థలో పదకొండేండ్ల పాటు నిరంతరాయంగా పనిచేయడమనేది మామూలు విషయం కాదు. కుటుంబాలకు, పిల్లలకు దూరంగా ఉంటూ సొంతూళ్లకు వందల కిలోమీటర్ల దూరంలో ఉంటూ పనిచేయడం వల్ల మానసికంగా కుంగుబాటుకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల అధ్యాపకులు ప్రస్తుతం ఈ బాధను అనుభవిస్తున్నారు. ఉమ్మడి ఏపీలో ఉద్యోగంలో నియమితులైన చాలా మంది అధ్యాపకులు ఇప్పటికీ ఒకేచోట పనిచేస్తుండటం గమనార్హం. అదే సమయంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోని ఆదర్శ పాఠశాలల్లోని అధ్యాపకులకు రెండు, మూడుసార్లు బదిలీలు జరిగినట్టు సమాచారం. కోర్టు కేసుల కారణంగా బదిలీలు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. కానీ, కోర్టు కేసులు ఉండగానే.. ఇతర విభాగాల పరిధిలోకి వచ్చే ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయనే విషయాన్ని మరిచిపోరాదు. వారి బదిలీలు న్యాయస్థానాల తుది తీర్పులకు లోబడే జరిగాయి. కాబట్టి బదిలీల ప్రక్రియను ఇప్పటికైనా చేపట్టాలి.

మరోవైపు ఒకే ఉద్యోగ ప్రకటన ద్వారా నియామకమైన ఏపీలోని అధ్యాపకులకు బదిలీలతో పాటు 010 పద్దు కింద వేతనాలు పెరిగాయి. అంతే కాదు, పాఠశాల విద్యాశాఖలో విలీనం కూడా చేశారు. కానీ, తెలంగాణలో మాత్రం అలాందేమీ జరగలేదు. అధ్యాపక సంఘాల మధ్య సమన్వయం లేకపోవడమే సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడానికి ప్రధాన కారణం. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు సంఘాలు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదు. అందుకే ఇప్పటికైనా ఆదర్శ పాఠశాలల అధ్యాపకులు కలిసికట్టుగా ఉంటూ సమస్యల సాధనకు పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నది. తద్వారా 010 పద్దు కింద వేతనాలు చెల్లింపుతో పాటు బదిలీలు లాంటి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవచ్చు.

– డాక్టర్ కావలి చెన్నయ్య ముదిరాజ్
90004 81768

మూగబోయిన లలిత గీతం!



ఎడిటోరియల్ డెస్క్

ఉద్యమకాలంలో ఉవ్వెత్తున ఎగసిన పోరు పాట మూగవోయింది! లలిత సినీ గేయ రచనలో ఒక ఒరవడిని సృష్టించిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ 76 ఏండ్లకే పరమపదించారు. జీవితాంతం లలిత కళకు అంకితమైన ఆయన తన చివరి రోజుల్లోనూ కళామతల్లికి సేవలందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాటల తూటాలెక్కుపెట్టిన ఆయన జన్మభూమి రుణం తీర్చుకున్నారు.

తెలంగాణ సాహిత్యానికి వడ్డేపల్లి కృష్ణ చేసిన సేవ అపారం. ఆయన పాటలు ఉద్యమానికి ఊతమై చిందులు వేశాయి. ఇటీవల తెలుగు సినీ రచయితల సంఘం జీవన సాఫల్య పురస్కారంతో ఆయనను సత్కరించింది. ఇది జరిగిన కొన్నిరోజులకే ఆయన తీవ్ర అనారోగ్యం పాలై తుది శ్వాస విడవటం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు.

సిరిసిల్ల జిల్లాలోని ఓ చేనేత కుటుంబంలో జన్మించిన డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. తపాలాశాఖలో పదవీ విరమణ చేసిన ఆయనకు లలిత కళలంటే ఎంతో మక్కువ. లలిత కళలకు తన జీవితాన్ని ధారపోసిన ఆయన అనేక గీతాలను రచించారు. పిల్ల జమీందార్ చిత్రంలో 'నీ చూపులోన విరజాజి వాన', పెద్దరికం సినిమాలోని 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', భైరవ ద్వీపం చిత్రంలో 'అంబా శాంభవి'.. సహా అనేక ఆణిముత్యాల్లాంటి గీతాలను రచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'జయ జయ హే తెలంగాణ' నృత్య రూపకం రచించగా అన్ని వేదికలపై అది మార్మోగింది. సాహిత్యరంగంలో 25 ప్రక్రియల్లోనూ రచనలు చేసిన ఏకైక రచయితగా వడ్డేపల్లి కృష్ణ ప్రత్యేక గుర్తింపును పొందారు.




నివాళి

వందేండ్లలో వెలువడిన పది వేల లలిత గీతాలపై పరిశోధనలు చేసిన వడ్డేపల్లి.. పీహెచ్‌డీ కూడా అందుకున్నారు. ఆయన రచించిన వందలాది లలిత గీతాలు ఆకాశవాణి, దూరదర్శన్‌లో ప్రసారమయ్యా యి. 40 పైగా నృత్యరూపకాలు కూడా రాశారు. ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు.

రెండు సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఎక్కడికి వెళ్తుందో మనసు' చిత్రంలో సాయికుమార్ హీరోగా నటించారు. ఇటీవల కాలంలో సంచలనం సృష్టించిన బలగం సినిమాలో ఓ కీలక పాత్ర పోషించారు.

తన సాహిత్య జీవితంలో ఆయన ఎన్నో పురస్కారాలందుకున్నారు. ఆటా, తానా వేడుకల్లో, సాహి త్య చర్చల్లో పాల్గొంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన దర్శకత్వం వహించి, నిర్మించిన 'గోభాగ్యం' లఘుచిత్రానికి అంతర్జాతీయంగా అనేక పురస్కారాలు లభించాయి. 'బతుకమ్మ', 'రామప్ప రామణీయం' లాంటి అనేక లఘు చిత్రాలకు నంది పురస్కారాలు వరించాయి. ఈ సందర్భంగా వడ్డేపల్లికి అశ్రునివాళి. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి.



పోరాటం ఇంకా ఉంది!



ఢిల్లీ రోడ్లపై మమ్మల్ని ఈడ్చుకెళ్లినప్పుడు బీజేపీ తప్ప అన్ని పార్టీలు మాకు అండగా నిలిచాయి. మా కష్టాల్ని, కన్నీళ్లను అర్థం చేసుకున్నాయి. ఒకవేళ నేను అనుకొని ఉంటే, జంతర్‌మంతర్ వద్దే రెజ్లింగ్‌ను వదిలేసేదాన్ని. కానీ, అలా చేయలేదు. ఒలింపిక్స్ ఫైనల్‌కు చేరుకున్నా. అయితే దేవుడు వేరే ప్లాన్ రచించాడు. ఇప్పుడు దేశానికి సేవ చేసేందుకు మరో అవకాశం ఇచ్చాడు. నా పోరాటం ఇంకా ముగియలేదు. ఆపదలో ఉన్న నా సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా.

- వినేశ్ ఫోగట్, రెజ్లర్

పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్

- ఎట్టకేలకు ఖాయంచేసిన కాంగ్రెస్ అధిష్ఠానం
- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి ఎమ్మెల్సీ
- గతంలో గిడ్డంగుల చైర్మన్‌గా బాధ్యతలు



కుటుంబ నేపథ్యం

పేరు: బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
పుట్టిన తేదీ: 1966 ఫిబ్రవరి 24
భార్య: సంధ్యారాణి
సంతానం: ఇద్దరు కొడుకులు (రుత్విక్‌గౌడ్, ప్రణవ్‌గౌడ్)
స్వస్థలం: రహత్‌నగర్, భీమ్‌గల్ మండలం, నిజామాబాద్ జిల్లా

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ)/నిజామాబాద్, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఈ మేరకు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఢిల్లీలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన మహేశ్‌కుమార్ ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఇంత కాలం సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన పదవీకాలం గత జూలైలోనే ముగిసింది. కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం రెండు, మూడు నెలలుగా పార్టీ నేతలతో చర్చలు జరిపింది. పీసీసీ అధ్యక్ష పీఠం కోసం మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఎంపీ బలరాంనాయక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తీవ్రంగా పోటీ పడినప్పటికీ అధిష్ఠానం మహేశ్‌కుమార్‌గౌడ్‌కే బాధ్యతలు అప్పగించింది. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడాలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో, పీసీసీ అధ్యక్ష పదవినైనా ఇస్తారని ఆ వర్గం నేతలు భావించారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ తనకు పీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోరారు. మాదిగలకు సైతం మంత్రివర్గంలో సరైన ప్రాధాన్యం దక్కకపోవడంతో పీసీసీ పీఠం కోసం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పోటీపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అండదండలు ఉండటంతో మహేశ్‌కుమార్‌గౌడ్ వైపే అధిష్ఠానం మొగ్గుచూపింది.

విద్యార్థి దశలోనే కాంగ్రెస్‌లోకి..

విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. 1986లో జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా నియమితులయ్యారు. 2013-14లో ఉమ్మడి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా వ్యవహరించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014లో టీపీసీసీ కార్యదర్శిగా, 2021లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2024లో తొలిసారిగా శాసనమండలికి ఎమ్మెల్యే కోటాలో ఎన్నికయ్యారు. 1994లో డిచ్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, 2014లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. గత డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మహేశ్‌కుమార్ గౌడ్‌కు క్యాబినెట్‌లో స్థానం లభిస్తుందని అప్పట్లో ఊహించారు. కానీ, అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా లేకపోవడంతో అవకాశం చేజారిందని భావిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలోనే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై చట్టసభలోకి ప్రవేశించారు.

సచివాలయ డోమ్‌లు కూలగొడతాం: బండి



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయంలో కూల్చివేతలు ఉంటాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ బేగంపేటలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే సచివాలయంలో డోమ్‌లను కూల్చేస్తామని గతంలో చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. వరదలకు సంబంధించి నిబంధనల ప్రకారం సాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నదని చెప్పారు.



జిట్టా పార్థివదేహానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న హరీశ్‌రావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి

ఉద్యమనేత 'జిట్టా' కన్నుమూత

- అనారోగ్యంతో బీఆర్‌ఎస్ నేత బాలకృష్ణారెడ్డి మృతి
- కొంత కాలంగా బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో ఐసీయూలో చికిత్స
- భువనగిరిలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- జిట్టా మృతిపై కేసీఆర్ దిగ్భ్రాంతి
- పలువురు ప్రముఖుల నివాళి



టీఆర్‌ఎస్‌లో చేరిక సమయంలో కేసీఆర్‌కు గొర్రెపిల్లను అందిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి

హైదరాబాద్/యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. నెలన్నరగా మృత్యువుతో పోరాడి శుక్రవారం ఉదయం 11.47గంటలకు తుదిశ్వాస విడిచారు. బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో గత నెలన్నరగా సికింద్రాబాద్‌లోని యశోదా దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. జిట్టా మరణవార్తతో భువనగిరి శోకసంద్రంలో మునిగిపోయింది. జిట్టా పార్థివదేహాన్ని భువనగిరిలోని ఆయన ఫామ్‌హౌస్‌కు తరలించారు. తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నేత, జిట్టా బాలకృష్ణారెడ్డి మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపాన్ని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం సాగిన పోరాటంలో జిట్టా బాలకృష్ణారెడ్డి క్రియాశీలకంగా పాల్గొన్నారని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. వారి మరణం దిగ్భ్రాంతిని కలిగించిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిట్టా ప్రస్థానం ఇలా..

జిట్టా 1972 డిసెంబర్ 14న జిట్టా బాల్‌రెడ్డి (రిటైర్డ్ టీచర్), రాధమ్మ దంపతులకు జన్మించారు. సొంతూరు భువనగిరి పట్టణ పరిధిలోని బొమ్మాయిపల్లి. ఆయనకు భార్య సునీత, కుమారుడు వివేకానందరెడ్డి, కూతురు ఝాన్సీ ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువజన సంఘాలను ఏకం చేయడంలో జిట్టా కీలక పాత్ర పోషించారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌తో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఉద్యమంలో మంచి పేరు తెచ్చుకున్న జిట్టాకు రాజకీయంగా కలిసిరాలేదు. భువనగిరి ఎమ్మెల్యేగా పలు దఫాలుగా పోటీ చేసినా అదృష్టం కలిసిరాలేదు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో పని చేశారు. వివిధ పరిణామాల నేపథ్యంలో సొంతంగా యువ తెలంగాణ పార్టీ స్థాపించారు. ఆ తర్వాత పార్టీని బీజేపీలో విలీనం చేశారు. అటు నుంచి కాంగ్రెస్, తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన తల్లి రాధమ్మ పేరున కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.106 గ్రామాల్లో వాటర్ ఫిల్టరు ఏర్పాటుచేయించారు. తెలంగాణ జాతర, ధూంధాం కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించారు. భువనగిరిలో జూనియర్ కాలేజీ భవనాన్ని నిర్మించేందుకు కృషి చేశారు.

అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు

ప్రజానేతకు భువనగిరి జనం అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జిట్టా పాడెను మోశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి అంత్యక్రియలు ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు డిమాండ్ చేశారు. పార్థివ దేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డిని అడ్డుకునేందుకు యత్నించారు.

అనేక పోరాటాల్లో కలిసి పనిచేశాం: మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

జిట్టా మృతిపై మాజీ మంత్రి టీ హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను కలచివేసిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన అనేక పోరాటాల్లో కలిసి పనిచేశామని, భువనగిరి ప్రాంత ప్రజల కోసం జిట్టా ఎంతో తపనపడ్డారని గుర్తుచేశారు.

జిట్టా మృతిపై కేటీఆర్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): జిట్టా బాలకృష్ణారెడ్డి మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. జిట్టా బాలకృష్ణారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కేటీఆర్ ప్రార్థించారు. జిట్టా కోలుకుంటారని భావించానని కానీ ఇలాంటి వార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించి మొదటి నుంచి కేసీఆర్ వెంట నడిచిన వ్యక్తుల్లో జిట్టా ఒకరని గుర్తు చేసుకున్నారు.

పలువురు నేతల సంతాపం, నివాళి

జిట్టా మృతిపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వేర్వేరుగా ప్రకటనలు జారీ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జిట్టా పార్థివ దేహానికి నివాళులర్పించారు. జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, క్యామ మల్లేశ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, చెరుకు సుధాకర్ నివాళి అర్పించారు.

బర్త్ సర్టిఫికెట్ లేక ఆగిన గుండె ఆపరేషన్

ఇబ్బందుల్లో పసి ప్రాణం

ములుగు, సెప్టెంబర్ 6 (నమస్తేతెలంగాణ): జనన ధ్రువీకరణ పత్రం లేక చిన్నారి గుండె ఆపరేషన్ ఆగింది. సదరు సర్టిఫికెట్ కోసం చిన్నారి తండ్రి పక్షం రోజులుగా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్నది. బాధితుడు అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకా రం.. ములుగు ప్రభుత్వ దవాఖానలో ఏప్రిల్ 27న సురేశ్ భార్య సుజాత బా బుకు జన్మనిచ్చింది. బాబు ఇటీవల అనారోగ్యానికి గురికాగా, వైద్యులకు చూపిస్తే బాబు గుండెకు రంధ్రం పడిందని ఆపరేషన్ చేయాలని చెప్పారు. రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పగా హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించేందుకు తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు జనన ధ్రువీకరణ పత్రం కావాలని అడిగారు. దీంతో గతనెల 27నుంచి సురేశ్ ములుగు గ్రామ పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు అందించలేదు. ఈ పత్రం ఉంటేనే వైద్యులు ఆపరేషన్ నిర్వహించే అవకాశం ఉన్నది.

అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: కొణతం దిలీప్



హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పోలీసులు తన ఇంట్లోకి అడుగుపెట్టిన మరుక్షణం నుంచి అర్ధరాత్రి మళ్లీ ఇంటివద్ద వాళ్లే వదిలిపెట్టే వరకూ అనుక్షణం అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సోమాభరత్, గండ్ర మోహన్ రావు, రాజేశ్వర్‌రావు, కల్యాణ్‌రావు, లలితారెడ్డి, జక్కుల లక్ష్మణ్, వేణుగోపాల్‌రావు, కార్తీక్, నిరంజన్‌రెడ్డితోపాటు న్యాయవాదులు తనకు అండగా నిలిచారని పేర్కొన్నారు. అక్రమ కేసు పెట్టి తనను జైలుకు పంపాలనే ప్రభుత్వ పన్నాగం పారలేదని చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రికార్డుస్థాయిలో మక్క ధరలు

క్వింటాకు రూ.3,015

కాశీబుగ్గ, సెప్టెంబర్ 6: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మక్కలకు రికార్డు స్థాయిలో ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2,090 ఉండగా, నెల రోజులుగా క్రమంగా పెరుగుతున్నది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా శుక్రవారం క్వింటాకు రూ.3,015 ధర పలికినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

మళ్లీ పెరిగిన ఉల్లి ధరలు

వారంలోనే రూ.10 పెరుగుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ఉల్లి ధరలు మళ్లీ పెరిగాయి. వారం రోజుల్లోనే కిలో రూ.10 పెరిగింది. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉల్లి ధరల ప్రభావం పడకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులో భాగంగా పెరుగుతున్న ఉల్లి ధరలను నియంత్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలే ఉల్లి ధరల పెరుగుదలకు కారణంగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో మార్కెట్‌లోకి ఉల్లి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీంతో హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.40 నుంచి రూ.45, బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70కి చేరింది. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారులు భయపడుతున్నారు.

ఆసిఫాబాద్ డీఎస్పీపై బదిలీ వేటు

పోలీసు పహారాలోనే జైనూర్ ఏజెన్సీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల ఆదివాసీ మహిళపై దాడి, ఆ తరువాత చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో ఆసిఫాబాద్ డీఎస్పీ పంతాటి సదయ్యపై బదిలీ వేటు పడింది. ఆయన్ను కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేయగా, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ఆసిఫాబాద్ డీఎస్పీగా బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న 144 సెక్షన్

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : జైనూర్‌లో పోలీసులు పటిష్ఠ భద్రత కొనసాగుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లతోపాటు అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్, నార్త్ జోన్ ఐజీ చంద్రశేఖర్, సిరిసిల్ల, జగిత్యాల, ఆదిలాబాద్ ఎస్పీలు అఖిల్ మహాజన్, అశోక్ కుమార్, గౌస్ ఆలం, బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ రెండు రోజులుగా అక్కడే ఉంటూ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. 144 సెక్షన్ శుక్రవారం కొనసాగింది. ఆధార్ ఉంటే తప్ప జైనూర్‌లోకి ఎవరినీ అనుమతించడం లేదు. శుక్రవారం నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభంకానుండగా, పోలీసులు మరింత బందోబస్తు పెంచే అవకాశమున్నది. జిల్లావ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు.

మూడు కమిషన్లకు చైర్మన్ల నియామకం

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం మూడు కమిషన్లకు చైర్మన్లను నియమించింది. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా ఎం కోదండరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించింది. వీరి పదవీకాలం రెండేండ్లు ఉంటుంది. బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్, సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి నియమితులయ్యారు. దీనికి బీసీ వెల్ఫేర్ కమిషనర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు.

9 నెలలు.. 1,900 లైంగికదాడులు

- సర్కార్ ఫెయిల్.. గాడితప్పిన శాంతిభద్రతలు
- మహిళల రక్షణ విషయంలో మొద్దునిద్ర
- బీఆర్‌ఎస్ హయాంలో సేఫెస్ట్ బెస్ట్ స్టేట్‌గా గుర్తింపు:హరీశ్
- పోలీసులను ప్రభుత్వం పని చేయనివ్వడం లేదని విమర్శ
- జైనూరు బాధిత మహిళకు గాంధీ దవాఖానలో పరామర్శ
- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలి: సబిత, సునీత



గాంధీ దవాఖాన వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 6: గత తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో 1,900 లైంగికదాడి ఘటనలు, 2,600 హత్యలు జరిగాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. 260 స్మగుల్డ్ మారణాయుధాలు లభించినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడమే లేదని చెప్పారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదివాసీ మహిళను మాజీ మంత్రులైన సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి శుక్రవారం పరామర్శించారు. బాధిత మహిళ కుటుంబ సభ్యులతో వారు మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు అందిస్తున్న చికిత్స గురించి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతున్నదని, బీహార్ తరహాలో దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు అన్ని రంగాల్లో ఫెయిలైందని, శాంతి భద్రతలు గాడి తప్పాయని విమర్శించారు. గత కేసీఆర్ పాలనలో తెలంగాణను శాంతి భద్రతలకు సేఫెస్ట్ అండ్ బెస్ట్ స్టేట్‌గా మంచి పేరు వచ్చిందని గుర్తు చేశారు. నిరుపేద ఆదివాసీ మహిళపై పాశవికంగా దాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. భూపాలపల్లిలో కానిస్టేబుల్‌పై ఎస్సై లైంగికదాడి, ఇటీవల నాగర్‌కర్నూల్‌లో జరిగిన సంఘటన వరకు అనేక ఘటనలు నిత్యం జరుగుతూ వస్తున్నా ప్రభుత్వం మొద్దునిద్ర పోతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలకులు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని, జైనూరు లాంటి ఘటనలతో రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారుతున్నదని ధ్వజమెత్తారు.

బాధితురాలికి 10 లక్షల పరిహారం ఇవ్వాలి

గిరిజన ఆడబిడ్డపై జరిగిన దారుణమైన దాడిని బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంద్రవెల్లికి పోయి పెద్ద పెద్ద మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి గాంధీ దవాఖానకు వచ్చి లైంగికదాడిలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళను పరామర్శించే సమయమే దొరకడం లేదా? అని ప్రశ్నించారు. హోం, గిరిజన శాఖ ఆయన వద్దే ఉన్నా ఈ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రెండు నెలల్లోనే నాలుగు మతకలహాలు

కొత్త డీజీపీ వచ్చిన 2నెలల్లోనే రాష్ట్రంలో నాలుగు మత కలహాలు జరిగాయని, మెదక్‌లో సరిగాలేరన్న డీసీపీని తీసుకొచ్చి హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారని, రాష్ట్రంలో శాంతి భద్రతల వ్యవస్థ మొత్తం నాశనమైందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డయల్ 100 సరిగా పనిచేయడం లేదని, పోలీసులను ప్రభుత్వం పనిచేయనీయడం లేదని చెప్పారు. ఖమ్మంలో ఎన్‌కౌంటర్ జరిగి 10 మంది చనిపోయారని, గత దశాబ్దకాలంలో ఒక్క బుల్లెట్ శబ్దం కూడా లేదని, ఈ ప్రభుత్వ హయాంలో ఫేక్ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ జోక్యం చేసుకొని రాష్ట్రంలో రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను వేధించడం, ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం, కండువాలు కప్పడంలో సీఎం బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వరద నిర్వహణ, సహాయం, రుణమాఫీ, విద్యావ్యవస్థను నడపడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. అంతకుముందు జైనూరు ఘటనపై బాధితురాలి కుమారుడు మాట్లాడారు. రాఖీ కట్టేందుకుతన తన తల్లి ఆటోలో వెళ్తుంటే అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి ఆటో డ్రైవర్ లైంగికదాడి చేయడానికి ప్రయత్నించాడని చెప్పారు. ఆ సమయంలో తన తల్లి ప్రతిఘటించడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు.

ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదు: సునీతా లక్ష్మారెడ్డి

జైనూరు ఆదివాసీ మహిళపై జరిగిన దాడి లాంటి ఘటనలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని మహిళా కమిషన్ మాజీ చైర్మన్, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. జైనూరు బాధిత మహిళను చూస్తే హృదయం ద్రవించిందని, తీవ్రమైన గాయాలతో జీవచ్ఛవంలా పడి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇలాంటి ఘటనలపై బీఆర్‌ఎస్ పార్టీ నేతలు వెళ్లాకే ప్రభుత్వం సీరియస్‌గా స్పందిస్తున్నదని తెలిపారు. ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు రూ.10 లక్షల వరకు ఆర్థికసాయం అందజేయవచ్చని సూచించారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి: సబితా ఇంద్రారెడ్డి

జైనూరు ఘటనపై తక్షణ చర్యలకోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమీక్షించేందుకు సీఎంకు సమయం లేదని ఎద్దేవా చేశారు. కనీసం బాధితులకు న్యాయంచేసే దిశగా నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచన కూడా లేదని, ఈ ప్రభుత్వానికి మహిళలంటే చులకన భావన ఉన్నదని విమర్శించారు. రాష్ట్రంలో అత్యాచారాలు జరుగుతున్న చోట ఎక్కడ కూడా బాధ్యులపై శిక్షలు పడుతున్న సందర్భాలు కనిపించట్లేదని తెలిపారు. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒకమూల ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉన్నదని, ముఖ్యమంత్రి ఇప్పటికైనా కండ్లు తెరిచి ఘటనలపై రివ్యూ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నాగుపామును నోట్లో పెట్టుకొని విన్యాసం చేస్తున్న శివరాజు

సాహసం చేయబోయి.. ప్రాణాలు కోల్పోయి

- నాగుపామును నోట్లో పెట్టుకున్న యువకుడు
- అరగంటలో ప్రాణాలు కోల్పోయిన వైనం

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 6: కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో విషాదం చోటుచేసుకున్నది. శివ అనే 21 ఏండ్ల యువకుడు పాముతో చెలగాటమాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు. సరదాకు వీడియో తీసుకునే ప్రయత్నంలో ఏకంగా ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. దేశాయిపేట్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం వద్దకు నాగుపాము వచ్చిందని గురువారం సాయంత్రం స్థానికులు సమాచారమిచ్చారు. అక్కడే నివసిస్తున్న శివరాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని దాన్ని పట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా పడగ విప్పిన పాము తలను నోట్లో పెట్టి బంధించాడు. నిమిషం పాటు ఊపిరి తీసుకోకుండా నాగుపామును నోట్లో పెట్టుకొని వీడియో చిత్రీకరించాడు. పక్కకున్న యువకులు కేరింతలు కొట్టడంతో సరదాగా భావించాడు. కొద్దిసేపటి తర్వాత పామును బయటకు తీయగా, అప్పటికే పాము నీరసించి కిందపడి పోయింది. శివరాజు అక్కడి నుంచి చెట్టుకిందకు వెళ్లి కూర్చోగా, కాసేపటికే కండ్లు తిరిగి పడిపోయాడు. ఆందోళన చెందిన స్థానికులు పాము కాటుకు గురయ్యాడని గుర్తించి, బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

దళిత పోలీసు అధికారులపై వివక్ష ఎందుకు?

- ఐజీ ఆదేశాలనూ పట్టించుకోని కరీంనగర్ సీపీ
- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆరోపణ



కరీంనగర్ రాంనగర్, సెప్టెంబర్ 6 : సాక్షాత్తు ఐజీ ఆదేశాలు ఇచ్చినా కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి పట్టించుకోవడం లేదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ధ్వజమెత్తారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. దళిత పోలీసు అధికారులపై సీపీ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఐజీ జోక్యం చేసుకున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. తన సామాజిక వర్గానికి చెందిన ఏ అధికారికి అన్యాయం జరిగినా దళితుల ప్రతినిధిగా తాను స్పందిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పోలీస్ అధికారుల పదోన్నతుల విషయంలో కమీషన్లు తీసుకుంటున్నట్టు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ జిల్లాలో నలుగురు దళిత సీఐల పోస్టింగ్ కోసం మాత్రమే తాను మాట్లాడానని తెలిపారు. పోస్టింగుల కోసం వారి వద్ద నుంచి చిల్లిగవ్వ తీసుకున్నట్టు నిరూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఐజీ ఇచ్చిన ఆర్డర్‌ను సీపీ తిరస్కరించిన విషయం గురించి మాత్రమే తాను మాట్లాడానని వివరించారు. తాను కమిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు చేయలేదని పేర్కొన్నారు.

కేంద్రసాయుధ దళాల్లో 39,481పోస్టులు

పదో తరగతి ఉత్తీర్ణులకు అవకాశం

ఎడ్యుకేషన్ డెస్క్, నమస్తే తెలంగాణ : కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్ మ్యాన్(గ్రౌండ్ డ్యూటీ)పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్‌ఎస్‌సీ)నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 39,481 ఖాళీలు ఉన్నాయి. వీటిలో పురుషులకు 35,612, మహిళలకు 3,869పోస్టులన కేటాయించారు. బీఎస్‌ఎఫ్-15,654, సీఐఎస్‌ఎఫ్-7,145, సీఆర్‌పీఎఫ్-11,541, ఎస్‌ఎస్‌బీ-819, ఐటీబీపీ-3,017, అస్సాం రైఫిల్స్-1,248, సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్-35, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో-22ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై పురుషులు 170, మహిళలు 157సెం.మీటర్ల ఎత్తు ఉండాలి. 2025, జనవరి 1 నాటికి 18-23ఏండ్ల మధ్య ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అక్టోబర్ 14 గడువు. పూర్తి వివరాలకు https:// ssc.gov.inవెబ్‌సైట్‌ను సంప్రదించాలి.



గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గువ్వల బాలరాజు, బాల్క సుమన్ తదితరులు

గురుకుల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

- **విద్యాసంవత్సరం మధ్యలో ఫ్యాకల్టీ తొలగింపా?**
- **సర్కారుపై జగదీశ్‌రెడ్డి, కొప్పుల, ఆర్ఎస్పీ ఆగ్రహం**
- **గౌలిదొడ్డి గురుకులాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేతలు**

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 6: గౌలిదొడ్డి గురుకుల విద్యార్థుల జ్ఞానం ముందు కాంగ్రెస్ సీఎం, మంత్రుల జ్ఞానం సరిపోవటం లేదని, ఆ విద్యార్థులను చూసి బుద్ధి తెచ్చుకోవాలని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం గౌలిదొడ్డి గురుకుల విద్యాలయాన్ని బీఆర్ఎస్ తరఫున మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ విప్‌లు బాల్కసుమన్, గువ్వల బాల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డెక్కిన గౌలిదొడ్డి బాలుర ఐఐటీ అకాడమీ, బాలికల గురుకుల కళాశాల విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అనాలోచిత నిర్ణయాలు తీసుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సీఎం, మంత్రులు జ్ఞానం నేర్చుకొనేందుకు ఈ గురుకులానికి రావాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలోనే టాప్-10 స్కూళ్లకు పోటీగా నిలిచిన గురుకులాలు.. నిర్వహణలోపంతో ఇప్పుడు విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారు' అని వెల్లడించారు.

9 నెలల్లో 37 మంది విద్యార్థులు మృతి

కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్‌లో ఇద్దరు చిన్నారులు చనిపోయారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 9 నెలల కాలంలో 37 మంది పిల్లలు గురుకుల పాఠశాలల్లో చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన విద్యను దూరం చేయాలని కాంగ్రెస్ సర్కారు కుట్ర చేస్తున్నదని ఆర్ఎస్పీ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే పాఠశాల నుంచి వందల మంది గొప్ప వర్సిటీలకు వెళ్లారని, నేడు రోడ్డు మీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాస్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు ఉన్నారు.



గౌలిదొడ్డిలోని గురుకుల కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

భగ్గుమంటున్న బాసర ట్రిపుల్‌ఐటీ

మూడు రోజులుగా విద్యార్థుల ఆందోళన

17 డిమాండ్‌లు తీర్చాలంటూ పోరుబాట

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోడ దూకి రేవంత్ సంఘీభావం

అధికారంలోకి వచ్చాక పట్టించుకోని సీఎం

బాసర, సెప్టెంబర్ 6: బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక యూనివర్సిటీ (ఆర్జీయూకేటీ) విద్యార్థులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. గత మూడు రోజులు ఆందోళన చేస్తున్న విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా శుక్రవారం క్యాంపస్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం ముట్టడికి ఏబీవీపీ నాయకులు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో పలువురు ఏబీవీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. వీసీ రాజీనామా చేయాలని, రెగ్యులర్ వీసీని వెంటనే నియమించాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనివర్సిటీ అధికారులకు అందజేశారు. తమ డిమాండ్‌లు నెరవేర్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని, గతంలో మాదిరిగా ధర్నా చేస్తామని ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సంఘం (టీఎస్ఏఎస్) హెచ్చరించింది.

నాడు గోడ దూకిన రేవంత్

తమ సమస్యలను పరిష్కరించాలంటూ రెండేండ్ల క్రితం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బాసర ట్రిపుల్ ఐటీకి రాగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన పోలీసులను తప్పించుకొని గోడ దూకి ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోకి ప్రవేశించారు. విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి సీఎం అయినా తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ స్థానికంగా ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కేసీఆర్ ఆనవాళ్లను తుడిచే కుట్ర

- **గురుకులాల నిర్వీర్యం అందులో భాగమే**
- **బడుగులకు విద్యను దూరం చేసే కుట్ర**
- **ఇంటర్నేషనల్ గురుకులాలు కాదు.. ఉన్నవాటిని బాగుచేయాలి**
- **ప్రస్తుత పనివేళలు అశాస్త్రీయం**
- **'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ గురుకులాల్లో నెలకొంటున్న సమస్యలన్నింటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. బడుగులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే గురుకులాలను భ్రష్టుపట్టిస్తున్నది. ఇటీవల ప్రభుత్వం తీసుకుంటున్న వరుస నిర్ణయాలే అందుకు నిదర్శం' అని బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ గురుకుల సొసైటీల మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటర్నేషనల్ గురుకులాలను ఏర్పాటు చేయడం కాదు.. ప్రస్తుత గురుకులాలను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. మరింత మెరుగైన వసతులు కల్పించడంతోపాటు శాస్త్రీయమైన పనివేళలను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కుట్రలపై బడుగు, బలహీనవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, కులసంఘాలు, విద్యార్థి సంఘాలు తక్షణం స్పందించాలని శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిలుపునిచ్చారు. ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు.

తెలంగాణ గురుకులాల ప్రత్యేకత ఏమిటి?

ఇవి రాత్రికి రాత్రి పుట్టినవి కావు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు హయాంలోనే పురుడుపోసుకున్నవి. కేసీఆర్ వాటిని మరోమెట్టుకి తీసుకెళ్లారు. దేశానికే ఆదర్శ నమూనాగా నిలిపారు. సొసైటీ సెక్రటరీలందరికీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అందుకు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలోని సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) సాధించిన విజయాలే సాక్ష్యం. గురుకులాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను అనేక రకాలుగా వడబోసి ఈ సీవోఈల్లోకి ఎంపిక చేస్తారు. ఇంటర్ విద్యతోపాటు నీట్, జేఈఈ కోచింగ్ ఇస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీవోఈల్లోని పేదపిల్లలకు ప్రత్యేక కోచింగ్ ఇప్పించింది. మైక్రో షెడ్యూల్‌ను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా సబ్జెక్ట్ అసోసియేట్లను నియమించి రెండేండ్లపాటు ఆయా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌ను క్రాక్ చేసేందుకు కావాల్సిన మెళకువలపై తర్ఫీదు ఇచ్చింది. ఇది విజయవంతమైన ప్రయోగం. సీవోఈల నుంచి దాదాపు మూడు వేల మందికిపైగా విద్యార్థులకు నీట్, జేఈఈ ర్యాంకులు సాధించారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో చేరి డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, శాస్త్రవేత్తలుగా ఎదిగారు. నీట్ కోసం ఆపరేషన్ బ్లూ క్రిస్టర్, ఆపరేషన్ ఎమరాల్డ్ ఇట్లా అనేక ప్రయోగాలను నిర్వహించాం. కేసీఆర్ ఆ స్వేచ్ఛ ఇచ్చారు. విద్యార్థుల కోచింగ్‌కు నిధుల కొరత లేకుండా చూశారు. ఫలితంగానే దేశంలో ఏ గురుకుల సొసైటీకీ సాధ్యం కాని విజయాలు తెలంగాణ గురుకుల సొసైటీలకు సొంతమయ్యాయి.

కాంగ్రెస్ విధానాలు ఎలా ఉన్నాయి?

కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని బాహాటంగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆచరణలో చేసి చూపుతున్నారు. గురుకులాలపై కేసీఆర్ ముద్రను చెరిపేయాలనే కక్షతో బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నతవిద్యను దూరం చేసే కుట్రకు తెరలేపారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని చాలా గురుకులాల్లో టీచర్లే లేరంటే రేవంత్‌రెడ్డి పర్యవేక్షణ ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. సీవోఈల్లో గతంలోనూ రెగ్యులర్ స్టాఫ్ ఉండేది. వారితో ప్రయోగాలు చేశాం. ఫలితాలు రాకపోవడంతో వారితోపాటు సబ్జెక్టు అసోసియేట్లను ఏర్పాటుచేశాం. ఎంట్రెన్స్ కోచింగ్ ఇప్పించాం. ఆ సబ్జెక్ట్ అసోసియేట్లను తొలగించడమంటే గురుకులాలను నిర్వీర్యం చేయడమే. ప్రభుత్వ పెద్దల అండ, ప్రోత్సాహం లేకుండా విద్యార్థుల భవిష్యత్‌ను విఘాతపరిచే ఇలాంటి నిర్ణయాలను అధికారులు ఎలా తీసుకుంటారు? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురుకుల విద్యావ్యవస్థపై అవగాహన లేదు.

పనివేళల మార్పుపై మీ అభిప్రాయం?

గురుకులాల పనివేళలను మార్చడం పూర్తిగా ఆశాస్త్రీయం. ఉపాధ్యాయుడు ఎంత ప్రశాంతంగా, సంతోషంగా, ఉత్సాహంగా ఉంటే తరగతి గదిలో విద్యార్థికి అంత ప్రేరణగా నిలుస్తాడు. ఇష్టంగా పాఠాలు చెప్పి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారు. ఇప్పుడు మార్చిన పనివేళలతో గురుకులాల్లో ఆ ఆహ్లాదకర వాతావరణమే మారిపోయింది. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉండాలంటే ఉపాధ్యాయులు ఎంతో అసౌకర్యంగా గురవుతున్నారు. అది అంతిమంగా గురుకుల విద్యార్థులు, గురుకుల విద్యావ్యవస్థకే చేటు చేస్తుంది. విద్యార్థులపై ఒత్తిడిని దూరం చేసేందుకంటూ ప్రభుత్వమే మళ్లీ ఆధ్యాత్మిక సంస్థలతో మోటివేషనల్ క్లాస్‌లను నిర్వహించాలని చూడటమే విచిత్రం. ఇది తీవ్ర అభ్యంతరకరం. పాఠశాల అనేది లౌకికభావాలకు నిలయం. అవసరమైతే గతంలో మాదిరి కౌన్సిలర్లతో మోటివేషనల్ తరగతులు చెప్పించాలి. గతంలో గురుకుల సొసైటీలో ఏ విధానం అమలు చేయాలన్నా, తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఎక్కడో ఒకచోట ఏర్పాటు చేసి, ఫలితాలను సమీక్షించి ఆపై అన్ని గురుకులాల్లో అమలు చేసేవాళ్లం. ఇప్పుడు సర్కారుకు ఆ విధానమే లేదు. ఇప్పటికైనా పనివేళలను పునఃసమీక్షించాలి.

స్పోర్ట్స్ వర్సిటీపై మీ అభిప్రాయం?

కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న మరో హాస్యాస్పద నిర్ణయం. గ్రామీణస్థాయిలో, విద్యార్థిదశ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించకుండా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామంటే ఏమనాలి? రాష్ట్రంలో ఏ సొసైటీలో లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలోనే దాదాపు 60 స్పోర్ట్స్ అకాడమీలు ఉన్నాయి. ఈ అకాడమీలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో 32 పతకాలు, జాతీయస్థాయిలో 1,500కుపైగా పతకాలు సాధించారు. ఇటీవల స్పోర్ట్స్ అకాడమీకి చెందిన జూడోక్ క్రీడాకారుడు తిరుపతి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. విషయాన్ని తెలుసుకున్న కేటీఆర్ ఆ క్రీడాకారుడికి అయ్యే ఖర్చులన్నీ భరిస్తున్నారు. నందిని అనే నిరుపేద, రజక కుటుంబానికి చెందిన క్రీడాకారిణి అథ్లెట్ ఏషియన్ గేమ్స్‌లో ప్రతిభ చూపింది. బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఇచ్చినట్టు ఆ క్రీడాకారిణికి ప్రోత్సాహకం ఇవ్వలేదు. సరే అవేవీ లేవు అనుకున్నా ఏకంగా ఆ అకాడమీలను మూసేందుకు కుట్రపన్నింది. అకాడమీల్లోని హానరోరియం ఉద్యోగులందరినీ తొలగించాలని పూనుకోవడం అందులో భాగం కాదా?



గురుకుల వ్యవస్థ బలోపేతానికి మీరిచ్చే సలహాలు, సూచనలేమిటి?

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో గురుకుల వ్యవస్థను ఒకరికి మించి ఒకరు ఉన్నతంగా తీర్చిదిద్దారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి చేతనైతే ఆ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలి. కానీ, నిర్వీర్యం చేయాలనే కుట్రలకు తెరలేపితే సహించబోం. నిధులను పెంచండి, మెరుగైన వసతులను కల్పించండి. జాతీయ, అంతర్జాతీయ శాస్త్రవేత్తలను, విజేతలను తీసుకొచ్చి విద్యార్థులకు ప్రేరణ కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టండి. బడుగులను ఉన్నతవిద్యకు దూరం చేసే కుట్రలను మానుకోండి. ఎస్సీ గురుకుల సొసైటీ ఇటీవల తీసుకున్న నిర్ణయాలపై వెంటనే సమీక్షించండి. బాధ్యులపై చర్యలు తీసుకోండి.

ఇంటర్నేషనల్ గురుకులాలకు అర్థమేంటి?

అది ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డే చెప్పాలి. సీఎం, డిప్యూటీ సీఎంలు ఇద్దరూ తమ నియోజకవర్గాలైన కొడంగల్, మధిరలో ఇంటర్నేషనల్ గురుకులాల ఏర్పాటుకు పూనుకున్నారు. విద్యార్థులకు ఎలా ప్రవేశాలు కల్పిస్తారు? ఎవరి ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తారు? తదితర వాటికి సంబంధించి ఇప్పటివరకు మార్గదర్శకాలైతే లేవు. బయట వినిపిస్తున్న దాని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇలా అన్ని గురుకులాలను ఒకేచోట ఏర్పాటు చేస్తామంటున్నారు. గతంలో వైఎస్ హయాంలో ఇలాగే ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేశారు. అదొక విఫల ప్రయోగం. కేసీఆర్ నూతన విధానాలతో గురుకులాలను ఏర్పాటు చేశారు. అది విజయవంతమైంది. ఇంటర్నేషనల్ గురుకులాలను ఏర్పాటు చేయడం కాదు, దమ్ముంటే కేసీఆర్ స్థాపించిన గురుకులాలను ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకెళ్లాలి.

నర్సింగ్‌లో అబ్బాయిలకూ అవకాశం ఇస్తారా?

- **వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఎదురుచూపు**
- **హాస్టల్ లేదంటూ నిరాకరిస్తున్న ప్రిన్సిపాళ్లు**
- **డే-స్కాలర్‌గా అయినా వస్తామంటున్న విద్యార్థులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీఎస్సీ నర్సింగ్‌లో అబ్బాయిలకు కూడా అవకాశం ఇవ్వాలని ఉత్తర్వులు ఉన్నా.. దశాబ్దాలుగా అమలు కావడం లేదు. హాస్టల్ లేదన్న కారణంతో అడ్మిషన్లు ఇవ్వడానికి నర్సింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లు నిరాకరిస్తున్నారు. ఏటా బీఎస్సీ నర్సింగ్ అడ్మిషన్లకు ముందు 'ఈ ఏడాది బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అబ్బాయిలను (మేల్ నర్సింగ్) చేర్చుకోవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?' అని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అడగడం.. 'హాస్టల్ లేదు కాబట్టి చేర్చుకోము' అంటూ ప్రిన్సిపాళ్లు సమాధానం ఇవ్వడం 2007 నుంచి ఇదే ఆనవాయితీగా వస్తున్నది. ఎంబీబీఎస్ అడ్మిషన్లకు పచ్చజెండా ఊపేలా గురువారం హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కాళోజీ యూనివర్సిటీ సిద్ధమవుతున్నది. ఈసారైనా ప్రభుత్వం తమకు బీఎస్సీ నర్సింగ్‌లో అవకాశం ఇవ్వాలని అబ్బాయిలు కోరుతున్నారు. హాస్టళ్లు నిర్మించలేకపోతే నిబంధనలు సవరించి కనీసం డే స్కాలర్‌గా అయినా అవకాశం ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండు దశాబ్దాలుగా ఎదురుచూపు..

గతంలో బీఎస్సీ నర్సింగ్ కేవలం అమ్మాయిలకు మాత్రమే ఉండగా, 2005లో అబ్బాయిలకు కూడా అవకాశం కల్పిస్తూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఈ మేరకు 2006, 2007లో కొందరికి అవకాశం లభించింది. ఆ తర్వాత ఏడాది నుంచి హాస్టళ్ల లేవన్న కారణంతో అడ్మిషన్లను నిరాకరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం దేశ, విదేశాల్లో నర్సులకు మంచి డిమాండ్ ఉన్నది. జీఎన్ఎం (డిప్లొమా)లో అబ్బాయిలకు అడ్మిషన్లు ఇస్తున్నా, ఆ సర్టిఫికెట్‌కు పెద్దగా డిమాండ్ లేదు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేస్తే తమ భవిష్యత్తు బాగుపడుతుందని, ప్రభుత్వం ఈ ఏడాదైనా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. నిబంధనలను మార్చి అమలు చేస్తే డేస్కాలర్‌గా అయినా అవకాశమివ్వాలని కోరుతున్నారు.

బడిపిల్లల పట్టుదల.. తలవంచిన సర్కార్

మొదటిపేజీ తరువాయి...

సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్), నాన్ సీవోఈలు, ప్రత్యేక గురుకులాలు, స్పోర్ట్స్ అకాడమీలు, ఒకేషనల్ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం, గెస్ట్‌ఫ్యాకల్టీ, సబ్జెక్ట్ అసోసియేట్లు, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులందరినీ విధుల నుంచి తప్పించాలని ఇటీవలే సెక్రటరీ రాత్రికిరాత్రి ఉత్తర్వులు జారీచేశారు. అప్పటికే సదరు ఉద్యోగులకు 3 నెలలుగా వేతనాలను కూడా చెల్లించటం లేదు. జీతాలు చెల్లించకుండా, ముందస్తు సమాచారమివ్వకుండా, అకడమిక్ ఇయర్‌లో అర్ధాంతరంగా తొలగించటంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఉత్తర్వులను రద్దుచేసి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తుదకు మానవ హక్కుల కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశారు. 3 రోజుల నాటకీయ పరిణామాల తర్వాత ఎట్టకేలకు శుక్రవారం ముగింపు లభించింది. తొలగించిన పార్ట్‌టైం ఉద్యోగులందరినీ తిరిగి యథావిధిగా కొనసాగించాలని సొసైటీ సెక్రటరీ వర్షిణీ ఆదేశాలు జారీచేశారు. జూమ్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్స్, జోనల్ ఆఫీసర్లకు ఆదేశాలిచ్చారు.

బీఆర్ఎస్‌కు, 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు

రాత్రికిరాత్రే విధుల నుంచి తప్పించడంతో రోడ్డునపడ్డ ఫ్యాకల్టీకి బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి బాసటగా నిలిచారు. ప్రభుత్వ నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయిన వారంతా మాజీమంత్రి హరీశ్‌రావును కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిన ఆయన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. తొలగించిన పార్ట్ టైమ్ లెక్చరర్లు, టీచర్లందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రులు జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్‌తోపాటు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గౌలిదొడ్డి సీవోఈని సందర్శించారు. ఆందోళన చేపట్టిన విద్యార్థులకు బాసటగా నిలిచారు. వెంటనే సబ్జెక్ట్ అసోసియేట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవైపు బీఆర్ఎస్ ఒత్తిడి, మరోవైపు విద్యార్థులు, పార్ట్‌టైం ఉద్యోగుల ధర్నాతో ఎట్టకేలకు సర్కారు దిగివచ్చింది. ఈ సందర్భంగా పలువురు పార్ట్‌టైం ఉద్యోగులు బీఆర్ఎస్ పార్టీకి, 'నమస్తే తెలంగాణ' పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న ఫ్యాకల్టీ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు

సొసైటీ సెక్రటరీకి గురుకుల విద్యాజేఏసీ కృతజ్ఞతలు

గెస్ట్ ఫ్యాకల్టీని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు జారీచేయడంపై గురుకుల విద్యాజేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. సొసైటీ సెక్రటరీ అలుగు వర్షిణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానవీయ కోణంలో స్పందించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. 3 నెలల బకాయి వేతనాలను కూడా సత్వరమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కృతజ్ఞతలు తెలిపినవారిలో గురుకుల విద్యా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు సీహెచ్ బాలరాజు, ప్రభుదాస్, బాలస్వామి, యాదయ్య, రుషికేశ్‌కుమార్, చలపతి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ సర్కారులో గురుకులాలు నిర్వీర్యం

ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6: సాంఘిక సంక్షేమ గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నదని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం విమర్శించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో స్వేరోస్ ఇంటర్నేషనల్, ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నర్సయ్య, కార్యదర్శి సుంకరి వెంకటేశ్, కోకన్వీనర్ బానోతు రాంబాబు, స్టూడెంట్ ఫౌండేషన్ చైర్మన్ విజయ ఆర్య క్షత్రియులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాలపై కాంగ్రెస్ కక్ష కట్టిందని, విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చాపల సదానందం, మహిళా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లలితా రాణి, వెంకటేశ్, స్వేరోస్ ఇంటర్నేషనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలకబత్తిని వీరయ్య, ప్రకాశ్, గిరిజన విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు వెంకట్ బంజారా తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యార్థుల ధర్నా

అధ్యాపక ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీలోని జయప్రకాశ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎదుట శుక్రవారం బైఠాయించారు. 12 మంది గెస్ట్ లెక్చరర్స్‌కు 9 మందిని తొలగించారని, అధ్యాపకులు సరిపడా లేక విద్యాభ్యాసానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని వాపోయారు. - కల్వకుర్తి

రాష్ట్రంలో ఎడ్యుకేషనల్ ఎమర్జెన్సీ విధించాలి

- **సంక్షోభంలో పాఠశాల విద్య**
- **టీడీఎఫ్ నివేదికలో ఆందోళనకర అంశాలు**
- **పాఠశాల విద్యలో భారీ సంస్కరణలు అవసరం**
- **సర్కారుకు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాఠశాల విద్య అత్యంత సంక్షోభంలో ఉన్నది.. బోధన అభ్యసన రంగాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి.. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు రాష్ట్రంలో ఎడ్యుకేషనల్ ఎమర్జెన్సీ (విద్యా అత్యయిక పరిస్థితి)ని విధించాలని 'తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్) అభిప్రాయపడింది. పాఠశాల విద్యలో భారీ సంస్కరణలు అవసరమని ప్రభుత్వానికి ఓ నివేదికను సమర్పించింది. 'స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ స్టేట్-స్టేటస్ అండ్ సజెస్టెడ్ పాలసీ మెజర్స్' పేరుతో సంస్థ ఓ నివేదికను రూపొందించింది. ఆ నివేదికపై శుక్రవారం నారాయణగూడలోని భారత్ కాలేజీలో సంస్థ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, విద్యావేత్త ఉపేందర్‌రెడ్డి, గోనారెడ్డి, గోపాల్‌రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలోని పాఠశాల విద్యలో ఇప్పటికే పూడ్చలేనంత నష్టం జరిగిందని, ప్రభుత్వం ఏ మాత్రం జాప్యం చేయొద్దని, ఈ అభ్యసన సంక్షోభం నుంచి బయటపడేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించింది. రాష్ట్రంలో పర్యవేక్షణ గాడి తప్పిందని, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీచేసి, ఎడ్యుకేషనల్ గవర్నెన్స్‌ను మరింత పటిష్ఠం చేయాలని టీడీఎఫ్ సూచించింది. పాఠశాల విద్యకు కేటాయిస్తున్న బడ్జెట్‌లో 16-17 వేల కోట్లు ఉపాధ్యాయులు, సిబ్బంది జీతాలకే సరిపోతాయని, 15 శాతం నిధులను కేటాయించాలని ప్రభుత్వానికి సూచించింది.

నివేదికలోని ముఖ్యాంశాలు

- 2014లో రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో కలిపి మొత్తంగా 43,293 స్కూళ్లు ఉండగా, 2022-23కు వచ్చేసరికి స్కూళ్ల సంఖ్య 41,369కి పడిపోయింది. అయితే తగ్గుతున్న వాటిలో అత్యధికంగా ప్రైవేట్ స్కూళ్లే ఉండటం గమనార్హం.
- ఎన్‌రోల్‌మెంట్ మాత్రం కాస్త పెరగడం విశేషం. 2014-15లో 61,53,410 మంది విద్యార్థులు నమోదుకాగా, 2022-23కు వచ్చేసరికి మొత్తం నమోదు 62,28,665కు చేరింది.
- రాష్ట్రంలో 26,084 సర్కారు బడులు ఉండగా, ఒకే ఒక్క తరగతి గదితో నడుస్తున్న స్కూళ్లు 3,620.
- ఒక టీచర్‌తోనే నడుస్తున్న స్కూళ్లు 4,984, ఉండగా, ఇద్దరు టీచర్లతో నడుస్తున్న స్కూళ్లు 7,915 ఉన్నాయి. సగం స్కూళ్లకు సింగిల్ టీచర్ లేదా ఇద్దరు టీచర్లే దిక్కయ్యారు.
- రాష్ట్రంలో విద్యార్థుల డ్రాపౌట్ రేట్ ఇంకా కలవరపెడుతున్నది. 2020-21లో ప్రాథమిక బడుల్లో బాలుర డ్రాపౌట్ రేటు 7.38, బాలికల డ్రాపౌట్ రేట్ 7.35గా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో బాలురు 21.1 శాతం, బాలికలు 19.35, ప్రాథమికోన్నత బడుల్లో బాలురు 28.59, బాలికలు 27.56 శాతంగా ఉన్నది.
- బడ్జెట్‌లో విద్యకు కేటాయిస్తున్న నిధులు 7 శాతం దాటక ఏ మూలకూ సరిపోవడంలేదు. ఇతర రాష్ట్రాలు అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. 2023-24లో ఏపీ 12.6, కర్ణాటక 12, కేరళ 14, తమిళనాడు 14.1 శాతం చొప్పున నిధులు కేటాయించగా, తెలంగాణ కేలవం విద్యకు 7.6 శాతం మాత్రమే నిధులను కేటాయించింది. బడ్జెట్‌లో కనీసంగా 15 శాతం నిధులను విద్యారంగానికి కేటాయించాలి.

1,007 పోస్టులకు.. పనిచేస్తున్నది 58 మందే..

విద్యాశాఖలో పర్యవేక్షణ పూర్తిగా గాడి తప్పింది. ఏండ్లుగా పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీచేసిన దాఖలాల్లేవు. పర్యవేక్షణాధికారులు సహా ఉపాధ్యాయ విద్యకు సంబంధించి 1,007 పోస్టులు ఉంటే కేవలం 58 మంది పనిచేస్తున్నారు. దాదాపు 950 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఎంఈవో పోస్టులు 539 ఉంటే, ప్రస్తుతం 16 మంది మాత్రమే పనిచేస్తున్నారు. గెజిటెడ్ హెచ్ఎంలకే ఎంఈవోలుగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తున్నారు. వివిధ జిల్లాల్లో 5, 6 మండలాలకు ఒక ఎంఈవో చొప్పున పనిచేసిన దాఖలాలు ఉన్నాయి. ఒక జిల్లాలో అయితే 14 మండలాలకు ఒక్కరే ఎంఈవోగా వ్యవహరించారు. డైట్ కాలేజీల్లో 286కు 265, ప్రభుత్వ బీఈడీ కాలేజీల్లో 90 పోస్టులకు 85 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

డీఎస్సీలో అదనపు మార్కులు

- **ఫైనల్ కీ విడుదల.. త్వరలో ఫలితాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్షల నిర్వహణలో రేవంత్‌రెడ్డి సర్కారు ఫెయిలయ్యింది. డీఎస్సీ ప్రశ్నపత్రాల్లో అనేక తప్పులు దొర్లడమే ఇందుకు నిదర్శనం. జూలై 18న నిర్వహించిన ఎస్ఏ (సోషల్)మొదటి షిఫ్ట్‌లో ఒక ప్రశ్నకు ఆన్సర్ తప్పుగా ఉండగా, మూడు ప్రశ్నలకు ఇచ్చిన రెండు ఆప్షన్లను సరైన సమాధానంగా ప్రకటించారు. జూలై 30న ఎస్ఏ(సోషల్)మొదటి షిఫ్ట్ పరీక్షలో ఏకంగా 8 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారు. వారికి నాలుగు మార్కులు అదనంగా కలుస్తాయి. ఇక మరో ప్రశ్నకు రెండు ఆప్షన్లు సరైనవిగా ప్రకటించారు. వీరికి కూడా మార్కులు కలవనున్నాయి. కాగా, డీఎస్సీ ఫైనల్ కీ, రెస్పాన్స్‌షీట్లను విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. వారం, పది రోజుల్లో డీఎస్సీ ఫలితాలను విడుదల చేయనున్నది.

గురుకులంలో విద్యార్థుల వీరంగం

- **బ్యాట్లతో కొట్టుకున్న వైనం**

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 6: రెండు వర్గాలుగా విడిపోయిన విద్యార్థులు ఇనుప పైపులు, క్రికెట్ బ్యాట్లతో కొట్టుకున్న ఘటన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో గురువారం రాత్రి చోటు చేసుకున్నది. ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ విద్యార్థి చెడు వ్యసనాలకు లోనవ్వగా గమనించిన మరో విద్యార్థి ప్రిన్సిపాల్ నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదు చేసిన విద్యార్థిపై మరో విద్యార్థి కక్ష పెంచుకున్నాడు. హిందీ అధ్యాపకుడు గురువారం రాత్రి గంటపాటు డ్యూటీలో ఉండి ఇంటికి వెళ్లిపోగా ఇదే అదనుగా భావించిన విద్యార్థుల బృందం అర్ధరాత్రి హాస్టల్‌లోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ గాయపడిన వారిని ఎల్లారెడ్డి దవాఖానకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్, సీఐ రవీందర్‌నాయక్, జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి ఘటనపై విచారణ చేపట్టారు.